

మీనాక్షి సందడి

క్రేజీ హీరోయిన్ మీనాక్షి చౌదరి శనివారం సాయంత్రం పూతలపట్టు మండలం ముత్తిరేవుల సమీపంలోని శ్రీ వేంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలకు వచ్చారు.కళాశాలలో జరుగుతున్న సెలెస్టా వేడుకల్లో పాల్గొన్నారు.విద్యార్థినులతో కలిసి స్టెప్పులు వేసి సందడి చేశారు.

గత ఏడాది ఫలితాల్లో పూర్తిగా వెనుకబడినప్పటికీ విద్యార్థుల చదువులపై ఈసారి కూడా పర్యవేక్షణ కొరవడడం....రెగ్యులర్ అధ్యాపకుల సంఖ్యకు మూడింతలకు పైగా కాంట్రాక్టు అధ్యాపకులతో కళాశాలలను నడపడం....తదితర కారణాలతో ఈసారి కూడా ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాల్లో జిల్లా వెనుకే ఆగిపోయింది.పరీక్షలను చాలావరకూ పకడ్బందీ ప్రణాళికతో స్ట్రిక్ట్‌గా నిర్వహించడం కూడా ఫలితాలు తగ్గడానికి కారణంగా చెప్పొచ్చు.గత ఏడాదితో పోలిస్తే ద్వితీయ సంవత్సర ఫలితాల్లో కొంత మెరుగుపడినా ప్రథమ సంవత్సర ఫలితాల్లో గత ఏడాదిలాగే చివరి స్థానంలోనే నిలిచింది.

మరో సారీ!

● ఇంటర్ ఫలితాల్లో ప్రథమం అధమం ● కాస్త మెరుగుపడ్డ ద్వితీయం

చిత్తూరు సెంట్రల్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియట్ విద్యా మండలి నిర్వహించిన ప్రథమ, ద్వితీయ సంవత్సర పరీక్షా ఫలితాలు శనివారం విడుదలయ్యాయి. గత ఏడాది ఇంటర్ ప్రథమ, ద్వితీయ ఫలితాల్లో చిత్తూరు జిల్లా చివరి స్థానంలో నిలిచిన విషయం తెలిసిందే.ఈ ఏడాది ప్రథమ సంవత్సర ఫలితాల్లో చివరి స్థానంలోనే నిలిచింది. ద్వితీయ సంవత్సర ఫలితాలను మాత్రం కొంత మెరుగుపర్చుకుని 24వ స్థానంలో నిలిచింది. జిల్లావ్యాప్తంగా ప్రథమ, ద్వితీయ సంవత్సరంలోని (జనరల్, ఒకేషనల్) 28,261మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 18,250మంది విద్యార్థులు (64.57 శాతం) పాసయ్యారు. జనరల్‌లో 24,945 మందికి గాను 15,842 మంది (63.50 శాతం)ఉత్తీర్ణత సాధించగా, ఒకేషనల్‌లో 3316 మందికి గాను 2408 మంది (72.61 శాతం) ఉత్తీర్ణత సాధించారు. ప్రథమ సంవత్సరంలో 13,183 మందికి గాను 7168 మంది (54 శాతం)ఉత్తీర్ణత సాధించగా, ద్వితీయ సంవత్సరంలో 11,450 మందికి గాను 8440 మంది (74 శాతం)పాసయ్యారు.

●ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ప్రథమ సంవత్సరంలో 2481 మందికి గాను 1172 మంది (47శాతం)ఉత్తీర్ణత సాధించగా, ద్వితీయ సంవత్సరంలో 2160 మందికి గాను 1514 మంది (70శాతం)పాసయ్యారు.

● ప్రైవేటు కళాశాలల్లో ప్రథమ సంవత్సరంలో 9362 మందికి గాను 5189 మంది (55 శాతం)పాసయ్యారు. ద్వితీయ సంవత్సరంలో 8321 మందికి గాను 6175 మంది (74 శాతం) ఉత్తీర్ణత సాధించారు.

● హైస్కూల్ ప్లస్ కళాశాలల్లో ప్రథమ సంవత్సరంలో 361 మందికి గాను 140 మంది (38.78 శాతం)ఉత్తీర్ణత సాధించగా, ద్వితీయ సంవత్సరంలో 288 మందికి గాను 185 మంది (64శాతం) పాసయ్యారు.

● మోడల్ స్కూళ్లలో ప్రథమ సంవత్సరంలో 511 మందికి గాను 312 మంది (61.05 శాతం) ఉత్తీర్ణత సాధించగా, ద్వితీయ సంవత్సరంలో 441 మందికి గాను 349 మంది (79 శాతం)పాసయ్యారు.

● కేజీబీవీల్లో ప్రథమ సంవత్సరంలో 176 మందికి గాను 133 మంది (75.56 శాతం)ఉత్తీర్ణత సాధించగా, ద్వితీయ సంవత్సరంలో 227 మందికి గాను 180 మంది (79శాతం) పాసయ్యారు.

● ఏపీ రెషిడెన్షియల్ కళాశాలల్లో ప్రథమ సంవత్సరంలో 292 మందికి గాను 222మంది(76శాతం) పాసవగా, ద్వితీయ సంవత్సరంలో 325 మందికి గాను 271 మంది (83శాతం)ఉత్తీర్ణత సాధించారు.

● ఒకేషనల్‌లో ప్రథమ సంవత్సరంలో 1727 మందికి గాను 1164 మంది (64.57 శాతం)ఉత్తీర్ణత సాధించగా, ద్వితీయ సంవత్సరంలో 1589మందికి గాను 1244 మంది(78.28 శాతం)పాసయ్యారు.

వంద శాతం ఉత్తీర్ణత సాధించిన కళాశాలలు

ఇంటర్ ఫలితాల్లో జిల్లాలోని పలు జూనియర్ కళాశాలలు వంద శాతం ఉత్తీర్ణత సాధించాయి. కుప్పం ఏపీ సోషల్ రెసిడెన్షియల్ బాలికల జూనియర్ కళాశాలలో 52మంది పరీక్షలు రాయగా అందరూ ఉత్తీర్ణత సాధించారు. రొంపిచెర్ల కేజీబీవీ జూనియర్ కళాశాలలో 26 మంది విద్యార్థినులకు గాను 24 మంది ఉత్తీర్ణత సాధించారు. సదుంలోని బీసీ రెసిడెన్షియల్ బాయ్స్ జూనియర్ కళాశాలలో 30 మంది విద్యార్థులకు గాను 30మందీ పాసయ్యారు.

బోధనపై పట్టుబట్టినా...?

పాఠ్యపుస్తకాలు అందించడంతో పాటు మధ్యాహ్న భోజన సౌకర్యాన్ని ప్రవేశపెట్టిన ప్రభుత్వం ప్రైవేటు కళాశాలలకు దీటుగా ప్రభుత్వ కళాశాలల్లో బోధనపై దృష్టి పెట్టాలని ప్రయత్నించినప్పటికీ ఆశించిన స్థాయిలో ఫలితాలు సాధించలేకపోయింది. గతేడాది ప్రథమ సంవత్సర ఫలితాలు 49.65 శాతం కాగా, ఈ ఏడాది 54 శాతానికి పెరిగాయి. ద్వితీయ సంవత్సరంలో 62.64 శాతం నుంచి ఈ ఏడాది 74 శాతానికి ఎగబాకింది. కళాశాలల్లోని రెగ్యులర్, కాంట్రాక్టు అధ్యాపకుల మధ్య చోటు చేసుకున్న ఆధిపత్య పోరు విద్యార్థులపై ప్రభావం చూపిందనే విమర్శలున్నాయి. హాజరుపై దృష్టి సారించే అధ్యాపకులు బోధనపై ఆసక్తి చూపలేదనే వాదనలు వినిపిస్తున్నాయి. అన్నింటికీ మించి ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అధికారుల పర్యవేక్షణ మరింత మెరుగుపడాల్సి ఉంది.కళాశాలల్లో ఎక్కువమంది ప్రిన్సిపాళ్లు కూడా ఏ అధ్యాపకుడు, ఏ క్లాస్‌కు ఎన్ని గంటలు వెళుతున్నాడనే విషయంపై దృష్టి సారించలేదు.

రీకౌంటింగ్, రీ వెరిఫికేషన్ దరఖాస్తు

మార్కులు తక్కువగా వచ్చాయనుకున్న విద్యార్థులు రీ కౌంటింగ్, రీ వెరిఫికేషన్‌కు దరఖాస్తు చేసుకునేందుకు ఇంటర్ బోర్డు అవకాశం కల్పించింది. ఈనెల 13 నుంచి 22వ తేదీ వరకు సబ్జెక్టు వారీగా విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. రీ కౌంటింగ్‌కు రూ.260, రీవెరిఫికేషన్‌కు రూ.1200 చెల్లించాల్సి ఉండగా, ప్రథమ, ద్వితీయ ఇంప్రూవ్‌మెంట్‌కు ఆర్ట్స్ గ్రూపులైతే రూ.1350, సైన్స్ గ్రూపులైతే రూ.1600 చెల్లించాల్సి ఉంది. ఇక సబ్జెక్టుల పరీక్షలు రాసేందుకు ప్రథమ సంవత్సరానికి ఫీజు రూ.600, ద్వితీయ సంవత్సరం థియరీ అయితే రూ.600, ప్రాక్టికల్స్‌కు రూ.275, బ్రిడ్జ్ కోర్సులకు రూ.165 చెల్లించాల్సి ఉంది.

మే 12నుంచి సప్లిమెంటరీ పరీక్షలు

ఇంటర్మీడియట్ ఫెయిలైన విద్యార్థులకు సప్లిమెంటరీ పరీక్షల షెడ్యూల్‌ను ఇంటర్మీడియట్ విద్యామండలి విడుదల చేసింది. మే నెల 12వ తేదీ నుంచి 20వ తేదీ వరకు వరకు సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నారు. కాగా మే 28వ తేదీ నుంచి జూన్ ఒకటవ తేదీ వరకు జిల్లా కేంద్రంలో ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహిస్తారు. ఈనెల 18 నుంచి 24వ తేదీ వరకు పరీక్షల ఫీజు చెల్లించాల్సి ఉంది.

చిత్తూరు విద్యార్థుల ప్రతిభ



బైష్ణవ్(466) - జుహితరాజ్(466) - సాయి లహరి (466)



సి.నిఖిత(990), జి.కావ్య(990), పి.సాహితి(989), ఎం.వాసవి(989)



కుప్పం ప్రభుత్వ వృత్తి విద్యా కళాశాల - ఆర్.అనూష (497) , ఎస్.అభినయశ్రీ (495), డి.భవ్యశ్రీ (494)





శాంతిపురం ఆదర్శ పాఠశాలలో బైపీసీ విద్యార్థిని ఢిల్లీ ప్రియ(977) - విజయపురం మండలం కొత్త ఇళ్ళ త్తూరుకు చెందిన సాల్వ నవీన్(989)

ఇంటర్ విద్యార్థి ఆత్మహత్యాయత్నం

పుంగనూరు రూరల్, ఏప్రిల్12(ఆంధ్రజ్యోతి): ఇంటర్ ఫస్టియర్ ఫెయిలయ్యానని తెలిసి ఓ విద్యార్థి ఆత్మహత్యకు ప్రయత్నించాడు.పుంగనూరు శివార్లలోని హనుమంతరాయదిన్నెకు చెందిన జశ్వంత్(17) పలమనేరులో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. శనివారం విడుదలైన పరీక్ష ఫలితాల్లో రెండు సబ్జెక్టులు ఫెయిలయ్యానని తెలిసి జశ్వంత్ పిడుదల మందు తాగాడు. గుర్తించిన కుటుంబసభ్యులు పుంగనూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్సలందించారు.

కృష్ణాపురంలో మళ్లీ ఉద్రిక్తత

● అన్నదమ్ముల మధ్య భూతగాదా
● దాడిలో ఇద్దరికి గాయాలు

పుంగనూరు, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు మండలం చంద్రమాకులపల్లె పంచాయతీ కృష్ణాపురంలో ఇటీవల జరిగిన టీడీపీ కార్యకర్త రామకృష్ణ హత్య మరిచిపోక ముందే శనివారం మళ్లీ టెన్షన్ నెలకొంది. గ్రామ సమీపంలో అన్నదమ్ముల మధ్య భూతగదా నేపథ్యంలో దాడి జరిగింది.స్వయానా తమ్ముడి తలపై కర్రతో దాడి చేసిన అన్న అడ్డొచ్చిన అతడి భార్య, కుమారుని కూడా గాయపరిచాడు.ఈ సంఘటన పుంగనూరు, నిమ్మనపల్లె మండల సరిహద్దులో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. అన్నమయ్య జిల్లా నిమ్మనపల్లె మండలం బండ్లపై పంచాయతీ జాండ్లబైలుకు చెందిన ఎం.రామస్వామికి వేణుగోపాల్, హరినాథ్, మోహన్, మల్లికార్జున అనే కుమారులున్నారు. వీరికి 12.50 ఎకరాల భూములున్నాయి. హరినాథ్ చాలా కాలం క్రితం పుంగనూరు మండలం కృష్ణాపురానికి చేరుకుని అక్కడే ఉంటున్నారు. వీరి మధ్య కొంతకాలంగా ఆస్తి గొడవలతో పుంగనూరులో 4, నిమ్మనపల్లె పోలీస్‌స్టేషన్‌లో రెండు కేసులు నమోదయ్యాయి. కాగా శనివారం కృష్ణాపురానికి రెండు కిలోమీటర్ల దూరంలోని పొలం వద్ద ఎం.హరినాథ్ టమోటా పంటలో కర్రలకు జనుము పురి కట్టిస్తూ పొలంలోని గెనుము తెంచడం జరిగింది. తమ పొలంలోకి ఎందుకు వస్తారని, మల్చింగ్ పేపర్ ఎందుకు వేస్తారని జాండ్లబైలుకు చెందిన వేణుగోపాల్ కుమారుడు భరత్ ప్రశ్నించగా హరినాథ్ కర్రతో కొట్టాడు.ఈ విషయం వేణుగోపాల్‌కు ఫోన్‌లో భరత్ చెప్పాడు. పొలంలో పనిచేస్తున్న కూలీలకు మదనపల్లె నుంచి ద్విచక్ర వాహనంలో హరినాథ్, అతని కుమారుడు వెంకటేశ్ భోజనం తీసుకురాగా అప్పటికే పొలం వద్దకు చేరిన వేణుగోపాల్ వెదురుకర్రతో అతడి తలపై కొట్టాడు.



పుంగనూరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న హరినాథ్

దీంతో అతని తలకు గాయం కాగా పుంగనూరు ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించగా ఆరు కుట్లు పడ్డాయి. అలాగే హరినాథ్ భార్య కన్యాకుమారి, కుమారుడు వెంకటేశ్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఇందులో ఎలాంటి రాజకీయ కక్షలు లేవని, ముందస్తు ప్రణాళికతో దాడి జరగలేదని ఎస్ఐ లోకేశ్ తెలిపారు. దాడి విషయం తెలియగానే పుంగనూరు, నిమ్మనపల్లె పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారించారు. బాధితుల వద్ద ఆస్పత్రిలో స్టేట్‌మెంట్ రికార్డు చేసి పుంగనూరు పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. రెండు మండలాల సరిహద్దులో ఘటన జరగడంతో ఏ పోలీసుస్టేషన్ పరిధిలోకి వస్తుందో తెలియడంలేదని ఆదివారం రెవెన్యూ అధికారుల ద్వారా సర్వే చేయించి నిర్ధయిస్తామని ఎస్ఐ లోకేశ్ తెలిపారు. కృష్ణాపురంలో దాడి అనగానే ఉలిక్కిపడిన పోలీసులు విచారించగా చివరకు అన్నదమ్ముల మధ్య ఆస్తి తగాదా అని తేలింది. ఇద్దరూ టీడీపీకి చెందినవారేనని తెలుసుకున్నారు. డీఎస్పీ ప్రభాకర్, పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని ఈ సంఘటనపై పోలీసులు, టీడీపీ వర్గీయులతో మాట్లాడారు.

బంతి బలిగొంది!

● బావిలో పడిన బాల్ కోసం దిగి మునిగిపోయిన అన్న
● అతడికోసం అమాయకంగా బావిలో దిగిన చెల్లెలు
● మనవరాలిని మాత్రమే కాపాడగలిగిన నాన్నమ్మ





దిలీప్ మృతదేహం - మృత్యుంజయురాలు బన్నల

కల్లూరు, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ఆడుకుంటుండగా బావిలో పడిన బంతికోసం బావిలో దిగిన పన్నెండేళ్ల విద్యార్థి నీటిలో మునిగి చనిపోయాడు.అతడికోసం అమాయకంగా బావిలో దిగిన తొమ్మిదేళ్ల చెల్లెలిని మాత్రం కాపాడగలిగారు.పులిచెర్ల మండలం పోశంవారిపల్లి పంచాయతీ అయ్యావారిపల్లిలో శనివారం సాయంత్రం చోటుచేసుకున్న ఈ దురదృష్టకర ఘటనకు సంబంధించి కుటుంబీకులు తెలిపిన వివరాలివీ. అయ్యావారిపల్లికి చెందిన సురేష్ నాయుడు, లత దంపతులు కొన్నేళ్ల క్రితం బెంగళూరుకు వెళ్లి టైలరింగ్ పని చేసుకుంటూ అక్కడే జీవనం సాగిస్తున్నారు.వీరికి కుమారుడు దిలీప్ (12), కుమార్తె బన్నల (9) ఉన్నారు. వీరంతా ఉగాది పండుగకు గ్రామానికి వచ్చారు.పిల్లలకు శెలవులు కావడంతో వారిని తాతయ్య, నాన్నమ్మ దగ్గర వదిలి పెట్టి సురేష్ నాయుడు, లత బెంగళూరుకు వెళ్లారు. శనివారం సాయంత్రం నాన్నమ్మ లక్ష్మమ్మ తన మనవడు దిలీప్, మనవరాలు బన్నలతో పొలం వద్దకు ఆవులను మేపుకునేందుకు వెళ్లింది. అక్కడే వ్యవసాయ బావి పక్కన ఉన్న పొలంలో పిల్లలిద్దరూ బంతిని ఒకరికొకరు విసురుకుంటూ ఆటలాడుకుంటుండగా బంతి సమీపంలో ఉన్న బావిలో పడింది. అన్నా చెల్లెలు బావిలోని గట్టుపైకి చేరుకొని బంతిని ఎత్తుకునేందుకు ప్రయత్నించారు.ముందుగా దిలీప్ బావిలోని నీటిలోకి జారుకోవడంతో అన్నకోసం చెల్లెలు బన్నల నీటిలోకి దిగింది. దీంతో చిన్నారులిద్దరూ నీటిలో మునిగిపోతుండగా గమనించిన నాన్నమ్మ కొబ్బరి మట్ట సహాయంతో మనవరాలిని రక్షించింది. ఈలోపు దిలీప్ నీటిలో మునిగిపోయాడు.తనకు ఈత రాకపోవడంతో మనవడిని రక్షించుకోలేకపోయానని లక్ష్మమ్మ కన్నీటి పర్యంతమైంది.కల్లూరు ఎస్ఐ వెంకటేశ్వర్లు సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు.



బావి వద్ద వివరాలు సేకరిస్తున్న ఎస్ఐ వెంకటేశ్వర్లు

రిజిస్ట్రేషన్ల ద్వారా రూ.9.30 లక్షల ఆదాయం

చిత్తూరు సెంట్రల్, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): జిల్లాలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు రెండవ శనివారం కూడా ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు యధావిధిగా పనిచేసినట్లు స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీ గిరిబాబు తెలిపారు. 43 డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ చేయడం ద్వారా ప్రభుత్వ ఖజానాకు రూ.9.30 లక్షలు ఆదాయం సమకూరినట్లు తెలిపారు. అత్యధికంగా పలమనేరులో 21 డాక్యుమెంట్ల ద్వారా రూ.4.06 లక్షలు, పుంగనూరులో 12 డాక్యుమెంట్ల ద్వారా రూ.3.15 లక్షలు, చిత్తూరు అర్బన్‌లో 8 డాక్యుమెంట్ల ద్వారా రూ.1.59 లక్షలు, బంగారుపాళ్యంలో 2 డాక్యుమెంట్ల ద్వారా రూ.7850 ఆదాయం వచ్చినట్లు తెలిపారు. చిత్తూరు రూరల్, కుప్పం, కార్వేటినగరం, నగరి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఒక్క రిజిస్ట్రేషన్ కూడా జరగలేదన్నారు.

తిరువణ్ణామలై బస్సుల్లో రద్దీ




పౌర్ణమి సందర్భంగా తమిళనాడు తిరువణ్ణామలై గిరిప్రదక్షిణకు వెళ్లే ప్రయాణికులతో సీబీఎస్‌లో శనివారం రద్దీ ఏర్పడింది. వరుసగా మూడు సెలవులు రావడంతో ప్రయాణికులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. సీట్లకోసం బస్సుల వెంబడి పరుగులు తీయడం కనిపించింది. కాగా, తిరుమలలో తుంబురతీర్థం, తిరువణ్ణామలై గిరి ప్రదక్షిణకు ప్రత్యేక బస్సులు కేటాయించడంతో ఇతర ప్లాట్‌ఫామ్స్‌లో బస్సుల కొరత ఏర్పడింది. దీంతో గంటల తరబడి నిరీక్షణ తప్పలేదు. ఎండ తీవ్రతకు అవస్థలు పడాల్సి వచ్చింది.

- తిరుపతి(ఆర్టీసీ), ఆంధ్రజ్యోతి

తిరువణ్ణామలై బస్సులో సీట్ల కోసం ఎగబడుతున్న ప్రయాణికులు

'ఛాంపియన్' 50 శాతం షూటింగ్ పూర్తి


● హీరో రోషన్



తాను నటిస్తున్న 'ఛాంపియన్' చిత్రం షూటింగ్ 50 శాతం పూర్తయిందని హీరో రోషన్ తెలిపారు. తిరుమల శ్రీవారిని శనివారం ఉదయం దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. హనుమాన్ జయంతి రోజున శ్రీవారిని దర్శించుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. నటుడు శ్రీకాంత్ కుమారుడు కూడా అయిన రోషన్‌ను చూసేందుకు సినీ అభిమానులు ఉత్సాహం చూపారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

సర్వదర్శనానికి 14 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 14 గంటల సమయం పడుతోంది. శనివారం సాయంత్రం 5 గంటల వరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని అన్ని కంపార్టుమెంట్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయి క్యూలైన్ ఆక్టోపస్ ట్యాంక్ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

గురువారం హుండీ ఆదాయం : రూ.3.01 కోట్లు

శుక్రవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు : 70,462

తలనీలాలు సమర్పించినవారు : 25,393

క్రికెట్ కేరాఫ్... వెంకటగిరి

వెంకటగిరి, ఆంధ్రజ్యోతి



వెంకటగిరిలో క్రికెట్ పూర్వ వైభవాన్ని సంతరించుకుంటోంది. 135ఏళ్ల క్రితమే ఉనికి చాటుకున్న క్రికెట్ మళ్లీ ఆ దిశగా పరుగులు తీస్తోంది. కాసింత ప్రోత్సాహమిస్తే రంజీక్రీడలకు సైతం ఆతిథ్యమిచ్చేందుకు ఇక్కడి క్రీడా మైదానం సిద్ధమవుతోంది. నాడు రాజుల చొరవతో జాతీయ స్థాయి క్రీడాకారులు ఆడిన ఈనేల మళ్లీ క్రికెట్ వినోదాన్ని పంచేందుకు వేదికవుతుందనడం నిస్సందేహం. క్రికెట్‌కూ వెంకటగిరికీ ఉన్న అనుబంధాన్ని ఒకసారి పరిశీలిస్తే..





గతమెంతో ఘనం ...

క్రికెట్ ఊసే ఎరుగని రోజుల్లో వెంకటగిరిలో ఆ ఆట ఆడే వారంటే విస్మయం కలుగుతుంది. అప్పట్లో ఇంగ్లాండ్‌లో ప్రభువుల క్రీడగా గుర్తింపు పొందిన ఈఆటను ఇక్కడి ప్రాంతానికి పరిచయం చేశారు వెంకటగిరి రాజులు. 1890లో 28వ తరం రాజు గోపాలకృష్ణ యాచేంద్ర(బొమ్మదొర) స్థానిక నగరి ప్రాంగణంలోని ఇసుకలో క్రికెట్ ఆడేవారు. తర్వాత తరాలు ఈఒరవడి కొనసాగించాయి. ఆ స్ఫూర్తితో 1940లో స్థానికులు వెంకటగిరి క్రికెట్ క్లబ్(వీసీసీ)ను ఏర్పాటుచేశారు. ఈ జట్టుకు జగన్నాథ ప్రసాద్ కెప్టెన్‌గా సారథ్యం వహించారు. ఆంధ్రా జట్టుకు కొన్నాళ్లు కెప్టెన్‌గా వ్యవహరించిన వీవీవీఆర్కే యాచేంద్ర తమ సంస్థానం పేరుతో మరో క్రికెట్ క్లబ్‌ను స్థాపించారు. 1944లో రంజీ క్రీడాకారులున్న విజయనగరం జట్టుతో వెంకటగిరి జట్టు తలపడింది. ఏజీ రాంసింగ్‌తో పాటు ప్రముఖ క్రీడాకారులు కె.ఎస్.కన్నన్, సి.ఎస్.నాయుడు, ఆంధ్రా మాజీ కెప్టెన్ కె.చంద్రశేఖర్‌రావు వంటి తలపండిన క్రీడాకారులు వెంకటగిరి ఆటగాళ్లకు కోచ్‌లుగా వ్యవహరించారు. 1947లో ఇంగ్లాండ్ క్రీడాకారుడు లెస్ వెన్సిలిన్ కూడా వచ్చి శిక్షణ ఇచ్చారు. ఆయన దగ్గర శిక్షణ పొందిన వారిలో వీవీవీఆర్కే యాచేంద్ర, వీజీకే యాచేంద్ర, రాజగోపాల యాచేంద్రలు ఆంధ్రాజట్టుకు సారథ్యం వహించారు. కాలక్రమంలోక్రికెట్ కోసం రాజాల ఆధ్వర్యంలో జింఖానా గ్రౌండ్ ఏర్పాటైంది. 1953 ఆంధ్రక్రికెట్ అసోసియేషన్ ఆవిర్భావం వెనుక వెంకటగిరి రాజాలు కీలక భూమిక పోషించారు. ఇక్కడి మైదానంలో 1950-1951 మధ్య ఉమ్మడి మద్రాస్ రాష్ట్రంలో సిటి మఫ్‌సిల్ స్టేట్ సెలక్షన్ మ్యాచ్‌లు, 1954లో క్రికెట్ బోర్డు సెక్రటరీస్ మ్యాచ్‌లు, 1954-56 మధ్య ఇంటర్ జోనల్ మ్యాచ్‌లు జరిగాయి.



జింఖానా గ్రౌండ్‌లో మ్యాచ్ (ఫైల్ ఫొటో)

అప్పటినుంచి 1982 వరకూ జిల్లా,రాష్ట్ర స్థాయితోపాటు రంజీపోటీలు కూడా జరిగాయి. 1981లో అంతర్జాతీయ ప్రమాణాలతో ఈ మైదానంలో టర్ఫ్‌ను ఏర్పాటు చేశారు. అప్పట్లో మునిస్వామి, ఆర్. జగదీష్, వి.జి.కె.యాచేంద్ర, జి.ఎ. ప్రతాప్‌కుమార్, టి. శ్రీధర్, వి.సత్యప్రసాద్ యాచేంద్రలతో పాటు మరికొందరు రాష్ట్ర స్థాయి క్రీడాకారులుగా రాణించారు. తర్వాత జింఖానా గ్రౌండ్, అందులోని భవనాన్ని బయటవ్యక్తులు కొనుగోలు చేశారు. కొనుగోలుదారులు తమ అవసరాలకు అనుగుణంగా మైదానాన్ని మార్చి,భవనాన్ని కూల్చి వేయడంతో ఇక్కడ క్రికెట్ ఉనికి కోల్పోయింది. వేదిక లేక క్రికెట్ బోసిపోయింది.

క్రికెట్‌కు పూర్వ వైభవం

1996లో వీవీవీ ఆర్కే యాచేంద్ర క్రికెట్‌కు మళ్లీ ప్రాణప్రతిష్ఠ చేయాలని సంకల్పించారు. ఆయన కృషి ఫలితంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ స్పోర్ట్స్ అథారిటీ నిధులతో ఏర్పేడు-వెంకటగిరి రోడ్డు మార్గంలో పదెకరాల విస్తీర్ణంలో తారకరామా క్రీడా ప్రాంగణాన్ని ఏర్పాటైంది. కుమార్‌రాజా వీజీకే యాచేంద్రకు క్రికెట్‌పై ఉన్న మక్కువ, రాజాలకు ఆంధ్రాక్రికెట్ అసోసియేషన్‌లో పట్టు ప్రభావంతో ఈ గ్రౌండులో రెండు టర్ఫ్‌పిచ్‌లను ఏర్పాటయ్యాయి. ఏసీసీ నిర్వాహకులు ఈ క్రీడా ప్రాంగణంలో మెరుగైన సదుపాయాలను కల్పించడంతో సహకరించారు. దీంతో అంతర్జాతీయ ప్రమాణాల్లో ఇక్కడ క్రీడా ప్రాంగణం రూపుదిద్దుకొంది. సౌత్ జోన్ రాష్ట్ర ఎంపికలతో పాటు 800పైగా జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఇక్కడ శిక్షణ పొందిన పలువురు క్రీడాకారులు అండర్-14, అండర్-16, అండర్-22కి ఎంపికై రాష్ట్ర జట్టులో ప్రతిభను కనబరిచారు. ఔత్సాహికులకు శిక్షణ ఇచ్చేందుకు ఏసీసీ ధనుంజయ్‌ను కోచ్‌గా నియమించింది. ఇక్కడ రోజూ 30మంది క్రీడాకారులు శిక్షణ పొందుతున్నారు. మరోపక్క రంజీ స్థాయి మ్యాచ్ ఆడేలా గ్రౌండును తీర్చిదిద్దుతున్నారు. ఇటీవల కుమార్‌రాజా వి.జి.కె. యాచేంద్ర వద్ద శిక్షణ పొందిన ప్రజిత్, రాజేశ్వరరెడ్డి, దినేష్, సుబ్రమణ్యంలు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్నారు. రాష్ట్ర స్థాయి,రంజీమ్యాచ్‌ల నిర్వహణకు ఇక్కడి మైదానం అనువుగా ఉంటుందని క్రికెట్ నిపుణులు చెబుతున్నారు. కొంచెం శ్రద్ధ పెడితే గ్రౌండ్‌ను మరింత అభివృద్ధి చేయవచ్చునంటున్నారు. .

- 1890లోనే ఉనికి చాటుకున్న క్రికెట్
- నాటి రోజుల్లోనే రంజీ ప్లేయర్ల రాణింపు
- పూర్వ వైభవం దిశగా మళ్లీ అడుగులు



తారకరామా మైదానంలో క్రికెట్ ఆడుతున్న యువకులు

ఆరు దశాబ్దాల క్రితమే రాజగోపాల్ సారథ్యం

వెంకటగిరి సంస్థాన రాజ కుటుంబానికి సమీప బంధువు వెలుగోటి రాజగోపాల్ యాచేంద్ర(94) కన్నుమూశారనే వార్త ఇక్కడి క్రికెట్ అభిమానులను విషాదంలో ముంచింది. రాజగోపాల్ ఆంధ్ర తరఫున కెప్టెన్‌గా 15 ఫస్ట్ క్లాస్ మ్యాచులు ఆడారు. 1956-1957లో ట్రావెన్ కోర్-కొచ్చి జట్టుతో గుంటూరులో జరిగిన మ్యాచ్‌లో రంజీ క్రీడాకారుడిగా రంగ ప్రవేశం చేశారు. 1964- 1965లో హైదరాబాద్‌తో జరిగిన మ్యాచ్‌లో జట్టు కెప్టెన్‌గా వ్యవహరించారు. 1965-1967లో చెన్నై వెళ్లి సినీ నిర్మాణ రంగంలో ప్రవేశించారు. ఇదాలోకం, జేబుదొంగ, మల్లెపువ్వు సినిమాలకు నిర్మాణసారథ్యం వహించారు. 1999-2000లో నెల్లూరు తిరిగి వచ్చారు. ఈక్రమంలో అనారోగ్యంతో గురువారం తుదిశ్వాస విడిచారు.



రాజగోపాల్ యాచేంద్ర

తిరుమల మరుగుదొడ్డిలో విషపూరిత పాములు



తిరుమల, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి):తిరుమలలోని ఓ మరుగుదొడ్డిలో శనివారం విషపూరితమైన పాములు పట్టుబడ్డాయి. శ్రీవారి పాదాల వద్దనున్న మరుగుదొడ్డి పైభాగంలోని రేకుల్లో పాములు ఉండటాన్ని భక్తులు గుర్తించారు. సమీపంలోని భద్రతాసిబ్బంది సహకారంతో పాములు పట్టే టీటీడీ కాంట్రాక్ట్ ఉద్యోగి భాస్కర నాయుడికి సమాచారం ఇవ్వడంతో ఆయన అక్కడికి చేరుకుని చాకచక్యంగా పట్టుకున్నాడు. పట్టుబడిన పాములు పచ్చకట్ల పాములని, ఇవి చాలా ప్రమాదకరమైనవని ఆయన తెలిపారు.

సామాన్యుడిలా నెహ్రూ తలనీలాల సమర్పణ



తిరుమల, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): టీటీడీ బోర్డు సభ్యుడు జ్యోతుల నెహ్రూ సామాన్య భక్తులతో కలిసి తలనీలాలు సమర్పించారు. శనివారం ఉదయం తిరుమలలోని యాత్రికుల వసతి సముదాయం-1కి వెళ్లిన ఆయన భక్తులతో పాటే తలనీలాలు సమర్పించారు. అనంతరం కల్యాణకట్టలో భక్తులకు అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. సామాన్య భక్తులకు ఎలాంటి ఇబ్బందులూ లేకుండా సేవలందించాలని సిబ్బందికి సూచించారు.అనంతరం శ్రీవారిని దర్శించుకున్నారు.

వేసవి నుంచి ఉపశమనం

తిరుమల మాడవీధుల్లో తెరతో పైకప్పు ఏర్పాటు



మాడవీధుల్లో ఏర్పాటు చేస్తున్న పైకప్పు

తిరుమల, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): తిరుమలకు వచ్చే భక్తులకు వేసవి వేడి నుంచి ఉపశమనం కల్పించేలా టీటీడీ ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టింది. సాధారణంగా శ్రీవారి ఆలయ మాడవీధుల్లో పాదరక్షలతో తిరగడం నిషేధం. ఈ క్రమంలో చాలా మంది భక్తులు కాళ్లకు చెప్పులు లేకుండానే నడుస్తుంటారు. కూలింగ్ పెయింట్ వేసినప్పటికీ ఎండలు పెరిగిన క్రమంలో నడవలేక భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. వృద్ధులు, చిన్నపిల్లలు ఆగచాట్లు పడుతున్నారు. ఈ క్రమంలో టీటీడీ మాడవీధుల గ్యాలరీలు కలిసేలా ఆకుపచ్చటి తెరలతో తాత్కాలిక పైకప్పును ఏర్పాటు చేసింది. దీంతో భక్తులకు కాస్త ఉపశమనం లభిస్తోంది.

తిరుమల ఘాట్‌లో అదుపుతప్పిన టెంపో

● ఆరుగురికి స్వల్పగాయాలు



తిరుమల, ఏప్రిల్12(ఆంధ్రజ్యోతి): తిరుమల మొదటిఘాట్ రోడ్డులో శనివారం ఓ వాహనం అదుపుతప్పి క్రాష్ బ్యారియర్‌ను ఢీకొంది. చెన్నైకు చెందిన భక్తబృందం శ్రీవారిని దర్శించుకుని శనివారం సాయంత్రం తమ టెంపోలో తిరుగు ప్రయాణమయ్యారు. మొదటి మలుపు వద్ద వాహనం అదుపుతప్పి క్రాష్ బ్యారియర్‌ను ఢీకొంది. దీంతో ఆరుగురు భక్తులకు స్వల్పగాయాలయ్యాయి. మిర్యాలగూడకు చెందిన ఓ కుటుంబం ప్రయాణిస్తున్న కారు 13వ మలుపు వద్ద అదుపుతప్పింది. క్రాష్‌బ్యారియర్‌ను ఢీకొంది. ఒకరు గాయపడ్డారు.

వైభవంగా పార్వతీ పరమేశ్వరుల నగరోత్సవం



శ్రీకాళహస్తి, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామి అమ్మవార్ల నగరోత్సవం శనివారం వైభవంగా జరిగింది. ముక్కంటి ఆలయంలో పౌర్ణమిని పురస్కరించుకుని స్వామి అమ్మవార్లను విశేషంగా అలంకరించారు. అనంతరం ఆలయంలో పూజలు నిర్వహించారు. ఆ తర్వాత స్వామి అమ్మవార్ల ఉత్సవ మూర్తులు పురవీధుల్లో ఊరేగి భక్తులకు దర్శనమిచ్చారు. వారం రోజల పాటు సాగిన పెద్దకొట్టాయి ఉత్సవం పౌర్ణమితో ముగిసింది.

పురవీధుల్లో ఊరేగుతున్న స్వామి అమ్మవారు

అది పరువు హత్యే

●యువతి మృతి కేసులో వీడిన మిస్టరీ



విలేకర్లతో మాట్లాడుతున్న డీఎస్పీ ప్రసాద్

చంద్రగిరి, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండలం నరసింగాపురంలో యువతి మృతి కేసులో మిస్టరీ వీడింది. పరువు హత్యగానే తేలింది. కూతురు తన మాట విననందుకు చివరికి తల్లే కడతేర్చింది. శనివారం రాత్రి విలేకర్ల సమావేశంలో డీఎస్పీ ప్రసాద్ ఈ కేసు వివరాలను వెల్లడించారు. నరసింగాపురం గ్రామానికి చెందిన యువతి(16) రామచంద్రాపురం మండలం నెత్తకుప్పం హరిజనవాడకు చెందిన అజయ్‌లు ప్రేమించుకున్నారు. ఈక్రమంలో నిఖిత గర్భం దాల్చింది. దీనిపై ఆమె తల్లి సుజాత పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అజయ్‌పై పోక్సో కేసు నమోదు చేశారు. ఇటీవల బెయిల్‌పై విడుదలైన అజయ్‌ను సదరు యువతి మళ్లీ కొద్ది రోజులుగా కలుస్తోంది. ఇతర కులస్థుడుని ప్రేమించడాన్ని వ్యతిరేకించిన సుజాత తన కుమార్తెను మందలించింది. అయినా తల్లి మాటలేదు. దీంతో తల్లి ఆగ్రహంతో కుమార్తెను కొట్టి ముక్కు, నోరు మూసేసింది. ఊపరి ఆడకుండా చేసి హత్య చేసింది. దీనిని సహజ మరణంగా చిత్రీకరించేందుకు యువతి తల్లి ప్రయత్నించింది. పోలీసుల విచారణలో ఈ విషయం ఒప్పుకున్నట్లు డీఎస్పీ పేర్కొన్నారు. నిందితురాలిని అరెస్ట్ చేసి కోర్టుకు తరలించామన్నారు. కేసును 72 గంటల్లో ఛేదించినందుకు పోలీసులు గోపి, మునిరత్నం, పురందర్, సీసీఎస్ కానిస్టేబుల్ రవిప్రకాష్‌లను అభినందించారు. రివార్డులను అందించారు. సమావేశంలో సీఐ సుబ్బరామిరెడ్డి, ఎస్‌ఐ అనిత, పాల్గొన్నారు.

ఐడబ్ల్యూఎన్ ఏపీ చాప్టర్

చైర్‌పర్సన్‌గా చాందిని, వైస్‌గా ఉష



కమిషనర్ మౌర్యను సత్కరిస్తున్న ఐడబ్ల్యుఎన్ ప్రతినిధులు

తిరుపతి, ఏప్రిల్12(ఆంధ్రజ్యోతి): భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ)అనుబంధంగా ఉన్న ఇండియన్ ఉమెన్ నెట్‌వర్క్ (ఐడబ్ల్యుఎన్) ఏపీ చాప్టర్ 2025-26 సంవత్సరానికి కొత్త ఆఫీస్ బేరర్లను శనివారం ఓ హోటల్లో జరిగిన సమావేశంలో ఎన్నుకున్నారు. అవెరా ఏఐ మొబిలిటీ సహ వ్యవస్థాపకురాలు చాందిని చందన చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్‌గా ఉష నియమితులయ్యారు. ఈ సందర్భంగా సహకార శక్తితో పురోగతిని వేగవంతం చేయడమన్న అంశంపై ఒక సదస్సు నిర్వహించారు. తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్, తుడా వీసీ ఎన్. మౌర్య పాల్గొని ప్రసంగించారు. అన్ని రంగాలలో లింగ సమానత్వాన్ని ప్రోత్సహించాల్సిన అవసరం గురించి వివరించారు. సీఐఐ ఏపీ చైర్మన్ మురళీకృష్ణ మాట్లాడుతూ సీఎం చంద్రబాబు దార్శనికతతో ప్రతి కుటుంబంలో ఒక పారిశ్రామికవేత్త తయారుకావచ్చన్నారు. అనంతరం కమిషనర్ మౌర్యను సత్కరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ గల్లా రమాదేవి, మహిళా పారిశ్రామిక వేత్తలు పాల్గొన్నారు.

తుంబురతీర్థానికి పోటెత్తిన భక్తులు

సందర్శించిన 14,500 మంది భక్తులు

తిరుమల, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): తిరుమల శేషాచల అడవుల్లో ప్రముఖ తీర్థంగా భాసిల్లుతున్న తుంబుర తీర్థానికి భక్తులు పోటెత్తారు. శనివారం 14,500 మంది భక్తులు దర్శించుకున్నారు. తుంబురు తీర్థ ముక్కోటి సందర్భంగా శుక్ర, శనివారాల్లో భక్తులను తీర్థానికి అనుమతించారు. శుక్రవారం 3,500 మంది, శనివారం 11 వేల మంది భక్తులు అడవుల్లోని తీర్థానికి చేరుకుని పుణ్యస్నానాలు ఆచరించి తుంబురనాథుడిని దర్శించుకున్నారు. టీటీడీ పటిష్ట ఏర్పాట్లు చేయడంతో భక్తులు ఎలాంటి ఇబ్బందులూ లేకుండా తీర్థాన్ని సందర్శించారు. గోగర్భం డ్యాం వద్ద భక్తులకు నిరంతరాయంగా అన్నప్రసాదాలు, తాగునీరు ఇవ్వడంతో పాటు వైద్య సేవలు అందించారు.

హిందూ ధర్మ రక్షణ అందరి బాధ్యత



మాట్లాడుతున్న వశిష్ఠాశ్రమ పీఠాధిపతి స్వరూపానందగిరి

శ్రీకాళహసి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శుకబ్రహ్మ ఆశ్రమంలో శనివారం వార్షికోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆశ్రమ పీఠాధిపతి విద్యా స్వరూపానందగిరి స్వామి ఆధ్వర్యంలో ఆశ్రమ వార్షికోత్సవాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన ఆధ్యాత్మిక సభలో వశిష్ఠాశ్రమ పీఠాధిపతి స్వరూపానందగిరి స్వామి ప్రసంగిస్తూ ప్రస్తుత పరిస్థితుల్లో సెల్‌ఫోన్ మాయలో చిన్నారుల భవిష్యత్తు అంధకారంలో పడిపోతుందని, ఈ మురికి కూపం నుంచి బయటకు రావడానికి ఆశ్రమాల్లో నైతిక విలువలతో కూడిన విద్యను అందించాలన్నారు. హిందూ ధర్మ రక్షణకు ప్రతి కుటుంబం బాధ్యతగా భావించి ఒక సంతానానికి ఆశ్రమ విద్య అందించాలన్నారు. గృహస్థాశ్రమం నుంచి బిడ్డలు రాకపోతే హిందూ ధర్మం పరిరక్షణ మనుగడ ఎలా సాధ్యమన్నారు. జనాభా పెరుగుదల ఆవశ్యకతను ప్రభుత్వాలు గుర్తించి బిడ్డలను కనడంపై ఉన్న ఆంక్షలు ఎత్తివేశారని గుర్తు చేశారు. అనంతరం విశేష పూజలు, భజనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు ఆధ్యాత్మిక వేత్తలు పాల్గొన్నారు.

శ్రీధర్స్ విద్యార్థుల జయకేతనం



శ్రీధర్స్ అకాడమీ విద్యార్థులతో చైర్మన్ శ్రీధర్, అధ్యాపకులు

తిరుపతి(విద్య), ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): ఇంటర్ ఫలితాల్లో తిరుపతి ఏఐఆర్ బైపాస్ రోడ్డులోని శ్రీధర్స్ జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలతో జయకేతనం ఎగురవేశారని చైర్మన్ మద్దినేని శ్రీధర్ పేర్కొన్నారు. ప్రథమ ఎంపీసీలో ఉమామహేశ్వర్ 465 మార్కులు, నిత్య శ్రీకళ్యాణి, లీనాశ్రీ 464, శ్రీకర్‌రెడ్డి 463, యామిని, పనుష్య, వాసవి, మానస 462, షామితరెడ్డి, యశ్విత 460 మార్కులు పొందారు. 37 మంది విద్యార్థులు 450కి పైగా మార్కులు సాధించారు. జూనియర్ బైపీసీలో జ్యోష్నా 433, రక్షిత 426, దివ్య 422, దన్యత, ప్రియదర్శిని 419 మార్కులు పొందగా 10 మంది 410కి పైగా మార్కులు సాధించారు. సీనియర్ ఇంటర్లో వన్షిక, మహ్మద్ ఇమ్రాన్ 987, నిఖిలేశ్వర్ 985, యుక్త 984, మహ్మద్ తాలిబ్, పోషిత 980 మార్కులు పొందగా 28 మంది 950కి పైగా మార్కులు సాధించారు. వీరిని అడ్మినిస్ట్రేటివ్ సీఈఓ వాణిశ్రీ, అధ్యాపకులు అభినందించారు.

రేపటి 'పీజీఆర్ఎస్' రద్దు

చిత్తూరు అర్బన్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని సోమవారం అంబేడ్కర్ జయంతి కారణంగా రద్దు చేసినట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ సెలవు దినం కావడంతో జిల్లా, డివిజన్, మండల స్థాయిల్లోనూ రద్దు చేసినట్లు పేర్కొన్నారు. ఈ విషయాన్ని అర్జీదారులు గమనించాలని సూచించారు.

రేపు అంబేడ్కర్ జయంతి వేడుకలు

చిత్తూరు అర్బన్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకలను సోమవారం చిత్తూరులో ఘనంగా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక మెసానికల్ మైదానం సమీపంలో ఉన్న అంబేడ్కర్ భవన్‌లో ఉదయం 10గంటలకు వేడుకలు నిర్వహిస్తామని తెలిపారు. అంతకుముందు ఉదయం 9 గంటలకు దర్గా సర్కిల్ ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పుష్పాంజలి సమర్పిస్తారు. అక్కడినుంచి అంబేడ్కర్ చిత్రపటంతో అంబేడ్కర్‌వాదులు, దళిత సంఘాల నేతలు, ఉద్యోగులు, విద్యార్థులంతా ర్యాలీగా అంబేడ్కర్ భవన్‌కు చేరుకుంటారు.

వరసిద్ధుడి దర్శనానికి మూడు గంటలు



ప్రధాన ఆలయ ద్వారం వద్ద భక్తుల రద్దీ

ఐరాల(కాణిపాకం), ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకంలో వరసిద్ధుడి దర్శనానికి మూడు గంటల సమయం పట్టింది. ఉదయం నుంచి స్వామి దర్శనానికి వేల సంఖ్యలో భక్తులు విచ్చేయడంతో ఆలయ క్యూలైన్లు కిక్కిరిశాయి. భక్తుల మధ్య తోపులాటలు జరగకుండా ఆలయ ఈవో పెంచలకిశోర్, అధికారులు జాగ్రత్తలు తీసుకున్నారు.

వక్ఫ్ బోర్డు సవరణ చట్టాన్ని రద్దు చేయాలి: సీపీఐ



గాంధీ విగ్రహం ఎదుట నిరసన తెలుపుతున్న ముస్లిం ఐక్యవేదిక, సీపీఐ నాయకులు

చిత్తూరు రూరల్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): వక్ఫ్ బోర్డు సవరణ చట్టాన్ని రద్దు చేయాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక గాంధీ విగ్రహం ఎదుట ముస్లిం ఐక్యవేదిక కమిటీతో కలిసి నిరసన తెలిపారు. సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ.. రాజ్యాంగ విరుద్ధంగా ఈ చట్టాన్ని మోదీ ప్రభుత్వం తీసుకురావడాన్ని తీవ్రంగా విమర్శించారు. సీపీఐ నాయకులు గోపినాథ్, కె.మణి, చంద్ర, ఆర్ముగం రెడ్డి, విజయ్ కుమార్, ఎ.జ మీలాబి తదితరులు పాల్గొన్నారు.

ఆగి ఉన్న లారీని ఢీకొన్న బైక్

బీటెక్ విద్యార్థి దుర్మరణం, ఇద్దరికి స్వల్పగాయాలు

పూతలపట్టు, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ఆగి ఉన్న లారీని బైక్ ఢీకొన్న ప్రమాదంలో బీటెక్ విద్యార్థి ఒకరు దుర్మరణం చెందాడు. ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. రొంపిచెర్లకు చెందిన జాహిద్ (22) ముత్తిరేవుల వద్ద ఉన్న శ్రీవేంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. శనివారం సాయంత్రం సెలెస్టా కార్యక్రమానికి ఇద్దరు స్నేహితులతో కలిసి బైక్‌లో బయల్దేరాడు. బండపల్లె వద్దకొచ్చేసరికి ఆగి ఉన్న లారీని ప్రమాదవశాత్తూ వెనుక వైపు నుంచి ఢీకొన్నాడు. జాహిద్ అక్కడికక్కడే మృతిచెందాడు. మరో ఇద్దరు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. పూతలపట్టు సీఐ కృష్ణమోహన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఈతకు వెళ్లి ఉపాధ్యాయుడి మృతి



నందకుమార్(ఫైల్‌ఫొటో)

ఎర్రావారిపాలెం, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ఈతకు వెళ్ళిన ఓ ఉపాధ్యాయుడు మృతి చెందడంతో విషాదఛాయలు అలుముకొన్నాయి. ఎర్రావారిపాలెం మండలం బోడేవాండ్లపల్లె పంచాయతీ సారగుంటపల్లెకు చెందిన నందకుమార్(42) అన్నమయ్య జిల్లా కేవీ పల్లె మండలం మారేళ్ళ పడమటపల్లె మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. పీలేరులో ఉంటున్నారు. ఒంటిపూట బడుల నేపథ్యంలో శనివారం మధ్యాహ్నం ఆయన తన కుమార్తె దీపికతో కలిసి పీలేరు- రాయచోటి రోడ్డులోని పించాఏరులో ఈతకు వెళ్ళారు. నీటిలో దూకినప్పుడు తలకు బలంగా రాయి తగిలింది. చాలాసేపటి వరకూ తండ్రి పైకి రాక పోవడంతో కుమార్తె ఇంటికొచ్చి తల్లి స్వర్ణకు చెప్పింది వెంటనే ఆమె ఏటి వద్దకు వెళ్ళి చూసింది. భర్త నీటిలో విగతజీవిగా ఉండటం గుర్తించింది. కన్నీరుమున్నీరైంది. మృతదేహాన్ని సారగుంట పల్లెకు తరలించారు. తక్కువ లోతు నీటిలోనే చనిపోవడాన్ని బట్టి తలకు రాయి తగిలిందని భావిస్తున్నారు. నందకుమార్ మృతికి ఎమ్మెల్యే పులివర్తి నాని సంతాపాన్ని తెలియజేశారు. గ్రామంలో విషాద ఛాయలు అలుముకొన్నాయి. ఈయన ఎస్టీయూ మండల కార్యదర్శిగా కూడా పనిచేసేవారు.

ఇష్టారాజ్యంగా ప్రొటోకాల్ దర్శనం

● ముగ్గురు ముక్కంటి ఆలయ ఉద్యోగులకు మెమో

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి) : శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఏఈఓగా పనిచేస్తున్న విద్యాసాగర్ రెడ్డి మళ్లీ అత్యుత్సాహం ప్రదర్శించారు. ఇష్టారాజ్యంగా ప్రైవేటు వ్యక్తులకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి, ప్రొటోకాల్ దర్శనాలు చేయించారు. సీసీ కెమెరాల ద్వారా ఈవో బాపిరెడ్డి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకోవడంతో ఏఈఓతో పాటు మరో ఇద్దరు ఉద్యోగులను వివరణ కోరుతూ మెమోలు జారీ చేశారు. ఏఈఓ విద్యాసాగర్ రెడ్డి 9 నెలల క్రితం కాణిపాకం నుంచి శ్రీకాళహస్తీశ్వరాలయానికి బదిలీపై వచ్చారు. ఆది నుంచి ఆయన వ్యవహార శైలిపై విమర్శలు వ్యక్తమవుతూనే ఉన్నాయి. పీఆర్‌ఓ కార్యాలయంలో ప్రోటోకాల్ ఇన్‌చార్జి అధికారిగా రెండు వారాల క్రితం వరకు ఆయన విధులు నిర్వహించారు. వైసీపీ నేతల ద్వారా సిఫార్సులపై వచ్చే వారికి, కొందరు దళారుల ద్వారా వచ్చే ప్రైవేటు వ్యక్తులకు ఇష్టారాజ్యంగా తెల్ల కాగితాలపై సంతకాలు చేసి పాసులు జారీ చేశారు. ఓ దళారి దర్శనానికి వెళ్లి పట్టు పడడంతో నాలుగు నెలల క్రితం ఈ ఉదంతం వెలుగులోకి వచ్చింది. అధికారులు మందలించినప్పటికీ ఆయన తీరు మార్చుకోలేదు. దీంతో ఈవో బాపిరెడ్డి ఆయన్ను పీఆర్వో కార్యాలయం నుంచి ఆలయంలోని కంచి గడప వద్దకు బదిలీ చేశారు. అక్కడా ఆయన టికెట్ల పరిశీలనలో అలసత్వం వహించారు. అనుకూలమైన వ్యక్తులను టికెట్లు లేకుండానే క్యూలైన్లోకి అనుమతిస్తున్నారన్న అపవాదు మూట కట్టుకున్నారు. దీంతో ఈవో బాపిరెడ్డి ఆయనపై ప్రత్యేకంగా నిఘా పెట్టారు. శుక్రవారం మధ్యాహ్నం కొందరు ప్రైవేట్ వ్యక్తులు దర్శనం కోసం రాగా విద్యాసాగర్ రెడ్డి దక్షిణ గోపురం వద్ద ఆలయ మర్యాదలతో పూలమాలవేసి స్వాగతించారు. స్వామి అమ్మవారి సన్నిధిలో ప్రత్యేకంగా అంతరాలయ దర్శనం చేయించారు. కీలకమైన వేద ఆశీర్వాదం కూడా నిబంధనలకు విరుద్ధంగా జరిపించారు. ఆగ్రహించిన ఈవో వివరణ కోరుతూ విద్యాసాగర్ రెడ్డి, పీఆర్వో కార్యాలయంలో పనిచేసే రికార్డ్ అసిస్టెంట్ దుర్గాప్రసాద్, ఆశీర్వాద మండపంలో పనిచేసే విశ్వనాథ శర్మకు నోటీసులు జారీ చేశారు. వివరణ అనంతరం ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.

మూడేళ్లయినా సొంత భవనాల్లేవ్

పొరుగు భవనాల్లోనే ఆర్డీవో కార్యాలయాలు ● అద్దె భవనంలో నగరి డీఎస్పీ కార్యాలయం







కుప్పం న్యాక్ బిల్డింగులో ఆర్డీవో కార్యాలయం - పలమనేరు డీఆర్డీఏ బిల్డింగులో ఆర్డీవో కార్యాలయం - ప్రైవేటు బిల్డింగులో నగరి డీఎస్పీ కార్యాలయం

చిత్తూరు, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాల విభజనతో చిత్తూరుకు తీవ్ర అన్యాయం జరిగిన విషయం తెలిసిందే. ప్రముఖ ఆలయాలు, విద్యా, వైద్య సంస్థలు, పర్యాటక ప్రాంతాలు, భారీ పరిశ్రమలు.. ఇలా అన్నీ చిత్తూరు జిల్లాతో సంబంధం లేకుండా పోయాయి. వైసీపీ పాలకులు విభజిత చిత్తూరు జిల్లా అభివృద్ధిని కాంక్షించలేదు. జిల్లాల విభజన సమయంలో ఏర్పడిన రెవెన్యూ, పోలీసు సబ్ డివిజన్ కార్యాలయాలు అసౌకర్యాలతోనే మగ్గుతున్నాయి.జిల్లాల విభజన తర్వాత చిత్తూరు రెవెన్యూ సబ్‌డివిజన్ మాత్రమే మిగలడంతో అదనంగా పలమనేరు, కుప్పం, నగరి రెవెన్యూ డివిజన్లను ఏర్పాటుచేశారు. అలాగే చిత్తూరు, పలమనేరు పోలీసు సబ్‌డివిజన్లు మాత్రమే మిగలడంతో అదనంగా కుప్పం, నగరి డివిజన్లను ఏర్పాటు చేశారు. విభజన సమయంలో హడావిడిగా పొరుగు శాఖలకు చెందిన భవనాల్లో రెవెన్యూ కార్యాలయాలను తాత్కాలికంగా ఏర్పాటుచేసినా.. అవే శాశ్వతం అయిపోయాయి. రెండు డీఎస్పీ కార్యాలయాల పరిస్థితీ అలాగే ఉంది.

● ఊరికి దూరంగా ఆర్డీవో కార్యాలయం

కుప్పం ఆర్డీవో కార్యాలయాన్ని 2022 ఏప్రిల్‌లో ఊరికి సుమారు 6కిలోమీటర్ల దూరంలోని న్యాక్ బిల్డింగులో ఏర్పాటుచేశారు. రెవెన్యూ సమస్యలున్న ప్రజలు అంత దూరం వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నా.. కుప్పంలో అనేక ప్రభుత్వ భవనాలున్నా.. ఆర్డీవో కార్యాలయాన్ని మాత్రం మార్చడం లేదు.నగరి ఆర్డీవో కార్యాలయాన్ని అప్పటికప్పుడు పట్టణంలోని పశుసంవర్ధక శాఖ బిల్డింగులో ఏర్పాటుచేశారు. ఇప్పటికీ ఆ భవనంలోని కింది ఫ్లోర్‌లో పశుసంవర్ధకశాఖ ఏడీ కార్యాలయం, పై ఫ్లోర్‌లోని మీటింగు హాల్‌లో ఆర్డీవో కార్యాలయం ఉంది.పలమనేరులో కూడా డీఆర్డీఏ శాఖకు చెందిన భవనంలో ఆర్డీవో కార్యాలయాన్ని ఏర్పాటుచేశారు.

● అద్దె భవనంలోనే డీఎస్పీ కార్యాలయం

నగరి డీఎస్పీ కార్యాలయం అప్పట్లో తాత్కాలికంగా అద్దె భవనంలో ఏర్పాటుచేసినా.. ఇప్పటికీ ప్రత్యామ్నాయ భవనాన్ని చూడకపోవడం ఆశ్చర్యకరంగా ఉంది. నగరిలోని తహసీల్దార్ కార్యాలయం సమీపంలోని ఓ ప్రైవేటు భవనంలో డీఎస్పీ కార్యాలయం నడుస్తోంది. కుప్పం డీఎస్పీ కార్యాలయాన్ని పాత కడా ఆఫీసు బిల్డింగులో నిర్వహిస్తున్నారు.

● ఇప్పుడిప్పుడే సిబ్బంది నియామకం

కొత్తగా ఏర్పడిన రెవెన్యూ, పోలీసు సబ్‌డివిజన్ కార్యాలయాల్లో ఆర్డీవో, డీఎస్పీ తప్ప మిగిలిన సిబ్బందిని అప్పట్లో డిప్యుటేషన్‌పై నియమించారు. ఆర్డీవో కార్యాలయాల్లో సిబ్బందిని తహసీల్దార్ కార్యాలయాల నుంచి, డీఎస్పీ ఆఫీసులోని సిబ్బంది పోలీస్‌స్టేషన్ల నుంచి నియమించుకున్నారు. ఆ సిబ్బంది కూడా సరిపడా ఉండేవారు కాదు. కూటమి ప్రభుత్వం వచ్చాక.. ఆయా రెవెన్యూ, పోలీసు కార్యాలయాలకు పూర్తి స్థాయిలో సిబ్బందిని నియమించి ఓ రూపు తెచ్చారు.

అసత్య ప్రచారం చేస్తున్న కరుణాకర రెడ్డి

● చిత్తూరు పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు సీఆర్ రాజన్ విమర్శ



మీడియాతో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

చిత్తూరు సిటీ, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): గోమరణాలపై టీటీడీ మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర రెడ్డి అసత్య ప్రచారం చేస్తున్నారని చిత్తూరు పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు సీఆర్ రాజన్ విమర్శించారు. శనివారం జిల్లా పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. కోట్లాదిమంది భక్తుల మనోభావాలు దెబ్బతినేలా టీటీడీపై ఆరోపణలు చేయడం భూమనకు సరికాదన్నారు. గోశాలలో ఆవులు వృద్ధాప్యంతోనూ, డెలివరీ సమయంలోనూ, వ్యాధులతోనూ నెలకు సగటున పది వరకు మృతి చెందుతుంటాయని చెప్పారు. 'అదో నల్లరాయి.. దానిమీదకు చెప్పు విసిరితే ఏమవుతుంది' అని వెంకటేశ్వర స్వామిని కరుణాకరరెడ్డి విమర్శించిన విషయం ప్రజలు మరచిపోలేదన్నారు. రాష్ట్రంలో అలజడి సృష్టించడానికే రోజుకో తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఇలాగే వ్యవహరిస్తే ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధులు సురేంద్రకుమార్, నేతలు మోహన్‌రాజ్, విజయకుమార్, మేషాక్ తదితరులు పాల్గొన్నారు.

రెండు మండలాల్లో 42.8 డిగ్రీల ఉష్ణోగ్రత





చిత్తూరులో వేసవి దెబ్బకు నిర్మానుష్యంగా మారిన బీఎస్ కన్నన్ కళాశాల రోడ్డు - ఎండ తాపానికి గొడుగు నీడ

చిత్తూరు సెంట్రల్, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉష్ణోగ్రతలు శనివారం 42.8 డిగ్రీలను తాకాయి. గుడిపాల, నగరి మండలాల్లో అత్యధికంగా 42.8 డిగ్రీలు నమోదు కాగా, మిగిలిన మండలాల్లో నమోదైన ఉష్ణోగ్రతలు ఇలా ఉన్నాయి. విజయపురం, చౌడేపల్లె మండలాల్లో 41, పాలసముద్రంలో 40.9, ఐరాలలో 40.4, సోమల, పూతలపట్టు మండలాల్లో 40.3, కుప్పంలో 40.2, బంగారుపాళ్యంలో 40.1, యాదమరి, రామకుప్పం మండలాల్లో 39.8, కార్వేటినగంలో 39, గుడుపల్లిలో 38.5, బైరెడ్డిపల్లిలో 38.1, వెదురుకుప్పంలో 38, పలమనేరులో 37.9, పెనుమూరులో 38.9, శాంతిపురంలో 38.5, నింద్రలో 37.7, పెద్దపంజాణి 37.5, గంగవరంలో 37.3, పుంగనూరులో 37.7, తవణంపల్లెలో 37.6, రొంపిచెర్లలో 36.9 గంగాధరనెల్లూలో 36.8, వి.కోట 36.7, చిత్తూరు మండలంలో 36, సదుంలో 35, ఎస్ఆర్‌పురంలో 34.3, పులిచెర్లలో 32.4 ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

చుడా,పీకేఎం-ఉడాలకే అప్రూవల్ అధికారాల

● టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ డైరెక్టరు నుంచి అధికారాలు బదిలీ

కలికిరి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కడప, చిత్తూరు జిల్లాల్లో కొత్తగా ఏర్పాటయిన పట్టణాభివృద్ధి సంస్థలకే అన్ని రకాల ఆమోదాలు జారీ చేసే అధికారాలు కల్పిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ప్రధానంగా సాంకేతికపరమైన ఆమోదాలు జారీ చేసే అధికారాలు కట్టబెట్టడంతో ఈ పట్టణాభివృద్ధి సంస్థల అధికారాలకు ఇంతవరకూ వున్న పరిమితులు తొలగిపోవడంతో పలు స్థానిక సంస్థలకు వెసులుబాటు లభించినట్లయ్యింది. చిత్తూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (చుడా), అన్నమయ్య పట్టణాభివృద్ధి సంస్థ (అనుడా), పలమనేరు-కుప్పం-మదనపల్లె పట్టణాభివృద్ధి సంస్థ (పీకేఎం-ఉడా)లకు ఎలాంటి సాంకేతిక ఆమోదాలు ఇచ్చే అధికారాలు లేకుండా అప్పటి వైసీపీ ప్రభుత్వం 2019 జూలై 19న జీవో జారీ చేసి కట్టడి చేసింది. అన్ని రకాల అభివృద్ధి అంశాలకు సాంకేతిక ఆమోదం ఇచ్చే అధికారాన్ని టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ డైరెక్టరుకు అప్పగించింది. దీని పైన ఒంగోలు, చిత్తూరు పట్టణాభివృద్ధి సంస్థల అధ్యక్షులు పదే పదే చేసిన విజ్ఞప్తులను పరిశీలించిన ప్రభుత్వం చివరికి సానుకూలంగా స్పందించింది. ఆ మేరకు చుడా, అన్నమయ్య పట్టణాభివృద్ధి సంస్థ (ప్రస్తుతం ఇది కడప పట్టణాభివృద్ధి సంస్థ.. కడప-ఉడాగా వుంది), పీకేఎం-ఉడాలకు అన్ని రకాల అభివృద్ధి పనులకు సంబంధించిన సాంకేతిక ఆమోదాలు తెలియజేసే అధికారాలను కట్టబెడుతూ ఇతర పట్టణాభివృద్ధి సంస్థలతోపాటు వీటికి కూడా స్వయం ప్రతిపత్తి కల్పిస్తూ మున్సిపల్ వ్యవహారాలు, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్ ఆదేశాలు జారీ చేశారు. మున్సిపల్ కమిషనర్లు, పంచాయతీ కార్యదర్శులు తమ ప్రతిపాదనలను ఇక నుంచి నేరుగా సంబంధిత పట్టణాభివృద్ధి సంస్థలకే పంపుకోవచ్చు. ఆయా సబ్ రిజిస్ట్రార్లకు కూడా దీంతో ఒక స్పష్టత వచ్చిందని చెపుతున్నారు. ఆయా సంస్థల పరిధుల్లోని మాస్టర్ ప్లాన్లను ఆమోదించుకునే వెసులుబాటు లభించింది. దీంతో పలురకాల ఆమోదాలు అవసరమైన రియల్ ఎస్టేట్ రంగాలవారు, ఇళ్ళ నిర్మాణాలు చేపట్టే వారికి కూడా పెద్ద ఊరట కల్పించినట్లయిందని చెపుతున్నారు.

పట్టణాభివృద్ధి సంస్థల పరిధుల్లో గందరగోళం

ఉమ్మడి కడప జిల్లా మొత్తానికి కడప-ఉడా ఒక్కటే కావడంవల్ల మొత్తం ఉమ్మడి కడప జిల్లాకు ఒకే పరిధి రావడంతో అక్కడ ఎలాంటి గందరగోళం లేకుండా స్పష్టత వచ్చింది. కానీ ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని చుడా, పీకేఎం-ఉడా పరిధిలో గందరగోళం నెలకొంది. చుడాలో అన్నమయ్య జిల్లాకు చెందిన పీలేరు నియోజకవర్గంలోని పీలేరు, కలికిరి, కలకడ, కేవీ పల్లె మండలాలు యథాతథంగా కొనసాగుతున్నాయి. అయితే ఇదే చుడా పరిధిలోని వాల్మీకిపురం, గుర్రంకొండ మండలాలను చుడా నుంచి విడదీసి పీకేఎం-ఉడా పరిధిలోకి చేర్చారు. ఇక పీకేఎం-ఉడా పరిధిలో మదనపల్లె నియోజకవర్గంలోని మూడు మండలాలు, తంబళ్ళపల్లె నియోజకవర్గం వున్నాయి. దీంతో ఒకే నియోజకవర్గంలో రెండు పట్టణాభివృద్ధి సంస్థలుండడంతో పలు విషయాల్లో అయోమయం నెలకొందని చెబుతున్నారు.

ఎస్వీ సెట్‌లో ముగిసిన సెలెస్టా



మీనాక్షి చౌదరికి జ్ఞాపిక అందజేస్తున్న కళాశాల వైస్ ఛైర్మన్ రావూరి శ్రీనివాస్

పూతలపట్టు, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): గుంటూరు కారం, సంక్రాంతికి వస్తున్నాం.. సినిమాల హీరోయిన్ మీనాక్షి చౌదరి ఎస్వీసెట్ (శ్రీ వేంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాల)లో సందడి చేశారు. పూతలపట్టు మండలం ముత్తిరేవుల సమీపాన ఉన్న కళాశాలలో మూడ్రోజులుగా జరుగుతున్న సెలెస్టా 2కె25 కార్యక్రమం శనివారం రాత్రితో ముగిసింది. ఈ సందర్భంగా మీనాక్షి చౌదరి మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థీ ఏదో ఒక రంగంలో తమకంటూ గుర్తింపు తెచ్చుకుని ఉన్నతస్థాయికి ఎదగాలని సూచించారు. అనంతరం ఆమె విద్యార్థినులతో కలిసి స్టెప్పులు వేయడంతో కళాశాల ఆవరణం విద్యార్థుల కేరింతలతో దద్దరిల్లింది. స్టేజి వద్దకు వచ్చిన విద్యార్థులతో ఆమె సెల్ఫీలు దిగారు. మీనాక్షి చౌదరిని కళాశాల వైస్ ఛైర్మన్ రావూరి శ్రీనివాస్ సన్మానించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఛైర్మన్ రావూరి వెంకటస్వామి, ప్రిన్సిపాల్ మోహన్ బాబు, వైస్ ప్రిన్సిపాల్ లోకనాథ్ రెడ్డి, రాజారెడ్డి, విజయ్‌కుమార్, అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఉగాది పురస్కార గ్రహీతకు సన్మానం



తులసినాథం నాయుడు దంపతులను సన్మానిస్తున్న ఎన్జీవో సంఘం, పీపీఎస్ నాయకులు

పలమనేరు, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): అమరావతిలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఉగాది పురస్కారం అందుకున్న పి. తులసినాథం నాయుడు దంపతులకు శనివారం పలమనేరు ఎన్జీవో హోంలో ఆ సంఘ నాయకులు, పలమనేరు పరిరక్షణ సమితి నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఏపీ ఎన్జీవో సంఘ పలమనేరు తాలూక అధ్యక్షులు ఆనందబాబు, పలమనేరు పరిరక్షణ సమితి కార్యదర్శి నరసింహులు, సభ్యులు సన్నిరాజు, శ్రీపురం సీతారామయ్య, జిల్లా అధ్యక్షులు రమణ, సాంబయ్య, రెడ్డెప్ప, పొన్ముడి, దేవరాజులు, మురళి, దొరస్వామి, నాగప్ప, శేఖర్, గ్రామసచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణాన్ని అడ్డుకోవడం సరికాదు



నిర్మాణ పనులను పరిశీలిస్తున్న గ్రామ పెద్దలు

శాంతిపురం, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని సొన్నేగానిపల్లె పంచాయతీ కుతేగానిపల్లె గ్రామంలో రామాలయం నిర్మాణ పనులను అదే గ్రామానికి చెందిన ఓ కుటుంబం అడ్డుకోవడం సరికాదని గ్రామస్తులు వాపోయారు. శనివారం గ్రామంలో నిర్మాణంలో ఉన్న రామాలయాన్ని పలువురు గ్రామపెద్దలు పరిశీలించారు. పనులు అడ్డుకోవడంపై రెవిన్యూ రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశామన్నారు. అధికారుల నుంచి ఎలాంటి స్పందన రాలేదన్నారు. ఆలయ నిర్మాణం పనులకు ఎలాంటి అడ్డంకులు లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. అధికారులు స్పందించకుంటే గ్రామస్తులతో మండల సచివాలయం ఎదుట నిరసన తెలుపుతామని హెచ్చరించారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు



పారిశుధ్య పనులు చేపడుతున్న అధికారులు

శాంతిపురం, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): శాంతిపురంలో శనివారం సర్పంచ్ ఏవీ జయరాం, పంచాయతీ కార్యదర్శి అశ్వత్‌నారాయణ ఆధ్వర్యంలో ముమ్మరంగా పారిశుధ్య పనులు చేపట్టారు. కెనమాకులపల్లె పంచాయతీ పరిధిలోని గ్రామాల్లోనూ పారిశుధ్య పనులు చేపట్టారు. శుభ్రం కావడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు.

కనులపండువగా కాశీవిశ్వేశ్వరుడి రథోత్సవం



భక్తజనం మధ్య సాగుతున్న రథోత్సవం

రామకుప్పం, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): రామకుప్పంలోని అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఉభయదారులు సజ్జల చెంగారెడ్డి కుటుంబసభ్యుల ఆధ్వర్యంలో రథోత్సవం కనులపండువగా జరిగింది. ఆదిదేవుడు రథంలో ఊరేగుతూ భక్తజనులను కరుణించాడు. ఉదయం వేదపండితులు సందీప్‌శర్మ, నాగరాజశర్మ సోదరుల నేతృత్వంలో ఆలయం ఎదుట సర్వాలంకార శోభితంగా ముస్తాబు చేసిన రథం ముందు రథాంగ పూజ, రథాంగ హోమం, రథాంగ బలి క్రతువులను శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులకు పలువురు దాతలు వడపప్పు, పానకం, మజ్జిగలను పంపిణీ చేశారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ



చెక్కులు పంపిణీ చేస్తున్న విశ్వనాథనాయుడు, టీడీపీ నేతలు

శాంతిపురం, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పలువురికి సీఎం సహాయ నిధి చెక్కులను మండల పార్టీ అధ్యక్షుడు భాష్యం విశ్వనాథనాయుడు ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో లబ్ధిదారులకు శనివారం పంపిణీ చేశారు. గడ్డూరు గ్రామానికి చెందిన నేత్రావతి, వి కొత్తూరు గ్రామానికి చెందిన మోహన్, గుజార్లపల్లెకు చెందిన సుబ్రహ్మణ్యం, చిన్నగాండ్లపల్లెకు చెందిన ప్రవీణ్‌కుమార్‌లకు సీఎం సహాయ నిధి చెక్కులు అందించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు మండల ప్రధాన కార్యదర్శి పీవీ నాగరాజు, మండల పార్టీ మాజీ అధ్యక్షుడు విజయరామిరెడ్డి, రాళ్లబూదుగూరు క్లస్టర్ ఇన్‌చార్జి చంద్రశేఖర్, గుంజార్లపల్లె యూనిట్ ఇన్‌చార్జి ఆంజనేయరెడ్డి, ఏఎంసీ నాగరాజు, రమేష్, రాజారెడ్డి, మురుగేష్, రాజేంద్ర, కొలమడుగు మురుగేష్ తదితరులు పాల్గొన్నారు.

చౌడేపల్లెలో వంద శాతం ఉత్తీర్ణత



వందశాతం ఉత్తీర్ణత సాధించిన చౌడేపల్లె హైస్కూల్ ప్లస్ బాలికలు

చౌడేపల్లె, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): చౌడేపల్లె స్కూల్ ప్లస్ బాలికల జూనియర్ కళాశాలలో విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించినట్లు హెచ్‌ఎం నాగరాజరెడ్డి తెలిపారు. ఎంపీసీ, సీఈసీ గ్రూపుల్లో 38 మంది పరీక్షలు రాసినట్లు పేర్కొన్నారు. స్థానిక జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సరంలో 75 మంది విద్యార్థులకు గాను 69 మంది పాసై 92 శాతం ఉత్తీర్ణత సాధించారు. మొదటి సంవత్సరం 71 మంది విద్యార్థులకు గాను 54 మంది పాసై 76 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ జయప్రకాష్ తెలిపారు.

● బైరెడ్డిపల్లె: మండలంలోని కమ్మనపల్లె ఆదర్శ పాఠశాలలో ఇంటర్ ఫలితాల్లో ఫస్టియర్‌లో 74 శాతం, సెకండియర్‌లో 86 శాతం ఉత్తీర్ణత సాధించారు.

● సోమల: సోమల కొల్లా వెంకట్రామానాయుడు ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఇంటర్మీడియట్‌లో 73 శాతం ఉత్తీర్ణత సాధించారని ప్రిన్సిపాల్ గంగాధరంనాయుడు శనివారం తెలిపారు. ద్వితీయ సంవత్సరంలో 95 మందికి గాయను 69 మంది పాసయ్యారు. మొదటి సంవత్సరం 83 మంది విద్యార్థులకు గాను 52 మంది ఉత్తీర్ణత సాధించినట్లు పేర్కొన్నారు.

రొంపిచెర్ల కేజీబీవీలో ఉత్తమ ఫలితాలు

రొంపిచెర్ల: రాష్ట్ర ప్రభుత్వం శనివారం విడుదల చేసిన ఇంటర్ ఫలితాల్లో రొంపిచెర్ల కస్తూర్బా విద్యాలయంలో విద్యార్థులు ప్రతిభ చూపారని ఎంఈవో శ్రీనివాసులు తెలిపారు. మొదటి సంవత్సరంలో 34 మందికి గాను 30 మంది, ద్వితీయ సంవత్సరంలో 26 మందికి గాను 26 మంది పాసై వంద శాతం ఫలితాలు సాధించారు.

విచ్చలవిడిగా మందుబాబుల ఆగడాలు



పొలాల వద్ద మందుబాబులు తాగి పడేసిన బీరు బాటిళ్లు

సోమల, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): సోమల పట్టణంలోని తిరుపతి గంగమ్మ ఆలయ సమీపంలోని శెట్టివారి వ్యవసాయ క్షేత్రం వద్ద నిత్యం మందుబాబుల ఆగడాలు మితిమీరుతున్నాయి. మద్యం తాగి ఆ సీసాలను అక్కడే పడేసి వెళుతున్నారు. మద్యం మత్తులో సమీప బండపై వాటిని పగులగొడుతున్నారు. రైతులు తమ పంటలను బండలపై ఒబ్బిడి చేసుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి వేళల్లో తిరుపతి, కలికిరి మార్గంలో శ్రీకృష్ణదేవరాయల్ సర్కిల్‌లో బస్సులు దిగిన మహిళలు ఒంటరిగా ఈ మార్గంలోనే ఇళ్లకు వెళుతూ ఇబ్బందులు పడుతున్నారు. అలాగే సోమల వారపుసంత వద్ద సాయంత్రం వేళల్లో మద్యం తాగుతున్నారు. పోలీసులు స్పందించి బహిరంగం ప్రదేశాల్లో మద్యం తాగే వారిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

కుప్పం గంగ జాతర ఉత్సవ కమిటీ నియామకం

కుప్పం, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): కుప్పంలో వెలసిన ప్రసన్న తిరుపతి గంగమాంబ జారత ఉత్సవ కమిటీని ప్రభుత్వం నియమించింది. గంగ జాతర వచ్చేనెల 14 నుంచి 21 వరకు జరుగనున్నాయి. ఆలయ పాలకమండలిని అధికారికంగా ఇంకా నియమించనందున తాత్కాలికంగా ఉత్సవ కమిటీని నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ప్రసన్న తిరుపతి గంగమాంబ పాలక మండలి మాజీ చైర్మన్ బీఎంకే రవిచంద్రబాబు, శారదమ్మ కొండస్వామి, ఎన్.నరేశ్, సి.సింధు రాజ్‌కుమార్, మంజుల మణి, సంతోషమ్మ జయరామ్ నాయుడు, ఎస్.మహేష్, ఎన్.వినాయకన్, వెన్నెల శరవణ, వీఏ.లక్ష్మి, జ్యోతీశ్‌లు ఉత్సవ కమిటీలో సభ్యులుగా ఉంటారు. గతంలో ప్రసన్న తిరుపతి గంగమాంబ పాలక మండలికి ప్రాథమికంగా చైర్మన్‌గా ఎంపికైన బీఎంకే.రవిచంద్రబాబు, సభ్యుల పేర్లే ఉత్సవ కమిటీలో ఉండటం గమనార్హం.

ప్రవేశ పరీక్ష తేదీ మార్పు

శాంతిపురం, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ఆదర్శ పాఠశాలలో ఆరో తరగతిలో చేరేందుకు ప్రవేశ పరీక్ష తేదీని ఈ నెల 21వ తేదీకి ప్రభుత్వం మార్పు చేసినట్లు శాంతిపురం ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ లత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రవేశ పరీక్షకు దరుఖాస్తు చేసుకున్న విద్యార్థులు తేదీ మార్పును గమనించి ఈనెల 21వ తేదీన పరీక్షకు హాజరు కావాలని కోరారు.

కిశోర బాలికలకు వివాహాలు నేరం

పలమనేరు, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): కిశోర బాలికలకు వివాహం చేయడం నేరమని, శారీరకంగా బలహీనులు కావడం తోపాటు పలు సమస్యలను ఎదురోవాల్సి ఉంటుందని అంగన్‌వాడీ కార్యకర్త చిలకమ్మ సూచించారు. శనివారం పలమనేరులోని రంగాపురం అంగన్ వాడీ కేంద్రంలో కిశోర బాలికలు, వారి తల్లి దండ్రులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పౌష్టికాహారం, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెల్పర్ పరిమళ, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

పశువుల కోసం నీటితొట్టెల ఏర్పాటు



పశువుల నీటితొట్టె ప్రారంభిస్తున్న టీడీపీ నాయకులు

బైరెడ్డిపల్లె, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాతూరు నత్తం పంచాయతీలో ఎన్ఆర్ఈజీఎస్ కింద పశువుల దాహార్తి తీర్చడానికి ఏర్పాటు చేసిన నీటితొట్టెలను టీడీపీ మండలాధ్యక్షుడు కిశోర్‌గౌడు శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి సుబ్రహ్మణ్యంశెట్టి, గౌరప్పగౌడు, సుబ్రహ్మణ్యంగౌడు తదితరులు పాల్గొన్నారు.

బీసీల సంక్షేమమే లక్ష్యం



రాజేంద్రప్రసాద్

రొంపిచెర్ల, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): బీసీల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తానని నూతనంగా ఎంపికైన రొంపిచెర్ల మండల బీసీ సంఘం అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో బీసీలు ఐక్యంగా ఉంటేనా సంఘం బలోపేతం అవుతుందన్నారు. రాకీయ నేతల సహకారంతో సమస్యలు పరిష్కరిస్తానని తెలిపారు.

వైభవంగా రాళ్లగంగమ్మ రథోత్సవం



గుడుపల్లె, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): గుడుపల్లెలో ప్రసన్న రాళ్ల గంగమాంబ వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. శనివారం ఉదయం అమ్మవారిని అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. మధ్యాహ్నం రథోత్సవం చేపట్టారు. భక్తులకు అన్నదానం చేశారు.

ఘనంగా సీతారాముల కల్యాణం



సోమలలో...

చౌడేపల్లె, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక హరి మందిరం, గోసలకురప్పల్లె రామాలయం, కర్ణంవారిపల్లెల్లోని అభయాంజనేయ స్వామి ఆలయం, అంకుతోటపల్లెలోని రామాలయాలల్లో సీతారామ లక్ష్మణ ఆంజనేయస్వామిలకు వేదపండితులు పంచామృతాభిషేకాలు నిర్వహించారు. సీతారాములను ప్రత్యేకంగా అలంకరించి శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహించారు.

● సోమల: సోమల కోదండ రామాలయంలో శ్రీరామ నవమి వేడుకల్లో భాగంగా శనివారం విశేష పూజలు చేపట్టారు. సోమల, సోమల దళితవాడ, పట్రపల్లె, పెద్దఉప్పరపల్లెలో సీతారాముల కల్యాణాన్ని వేదపండితులు కమనీయంగా నిర్వహించారు.

మొక్కు చెల్లించుకున్న ఎమ్మెల్సీ కంచర్ల



విజయపురం, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎం.అగరంలోని రామాలయంలో శనివారం నిర్వహించిన సీతారాముల కల్యాణోత్సంలో కంచర్ల శ్రీకాంత్, సరిత దంపతులు పాల్గొని మొక్కు చెల్లించుకున్నారు. ఎన్నికల్లో విజయం సాధిస్తే సీతారాముల వారికి కల్యాణం జరిపిస్తామని కంచర్ల మొక్కుకున్న విషయం తెలిసిందే. నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్, అరుణమిల్క్ ఎండీ మునిశేఖర్‌నాయుడు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గోవర్ధన్‌నాయుడు, గ్రామస్తులు రవినాయుడు, దామునాయుడు, శరవణనాయుడు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్టాండులో... మూతపడుతున్న దుకాణాలు

● లోపలకు రాని ఎక్స్‌ప్రెస్ బస్సులు ● పెంచుతున్న గదుల అద్దెలు

● బస్టాండులో ప్రయాణికుల తగ్గుముఖం ● డిపోకు తగ్గిన ఆదాయం



పలమనేరులోని ఆర్టీసీ బస్టాండు

పలమనేరు, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): పలమనేరు ఆర్టీసీ బస్టాండులో ఉన్న దుకాణాలు రోజురోజుకూ మూతపడుతున్నాయి. ఆర్టీసీ అధికారులు నిబంధనల పేరుతో ఏటా పెంచుకుంటూ పోతున్న అద్దెలు చెల్లించలేక దుకాణదారులు ఖాళీ చేస్తున్నారు. 1995 నవంబరు 18న నాటి, నేటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈ బస్టాండును ప్రారంభించారు. అంతకు ముందు ఈ బస్టాండు పంచాయతీ బస్టాండుగా ఉండేది. పట్టణ నడిబొడ్డున రూ.కోట్లు విలువచేసే ఈ బస్టాండును అప్పట్లో పంచాయతీ పాలక వర్గం ప్రజల సౌకర్యార్థం ఉచితంగానే ఈ స్థలాన్ని ఆర్టీసీకి కట్టబెట్టింది. ఈ స్థలంలో నాడు కేవలం నాలుగు బస్సులు మాత్రమే నిలిచేందుకు వీలుగా ప్లాట్‌ఫారాలు, బస్టాండు ఏర్పాటు చేశారు. ప్రారంభోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పలమనేరు అటు కర్నాటక, ఇటు తమిళనాడు రాష్ట్రాలకు అత్యంత చేరువలో పలమనేరు ఉందని.. బస్టాండును మరింత విస్తరింప జేస్తామని అప్పట్లో ప్రకటించారు. అయితే అప్పటి నుంచి ఎన్నో ప్రభుత్వాలు మారినా ఈ బస్టాండు గురించి పట్టించుకొన్న పాపాన పోలేదు. గతంలో ఈ పలమనేరు డిపో జిల్లాలోనే అత్యధిక కలెక్షన్లు సాధించే డిపోగాను, ప్రమాదాలు అతి తక్కువగా జరిగే డిపోగా పేరుండేది. అయితే కాలక్రమేణా ఆర్టీసీ అధికారుల నిర్లక్ష్యం ఇక్కడి ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం కారణంగా బస్టాండు దుస్థితి గురించి ఎవరూ పట్టించుకోక పోవడంతో డిపోలోని పలు బస్సు సర్వీసులను పుంగనూరు, చిత్తూరు, కుప్పం, మదనపల్లి డిపోలకు తరలించేశారు. దీంతో నేడు కేవలం 40 బస్సులు మాత్రమే డిపోలో నడుపుతున్నారు. ఉన్నవి సైతం కాలం చెల్లిన బస్సులు. గతంలో ఈ డిపో నుంచి నడిపిన నెల్లూరు, విజయవాడ, శ్రీహరికోట, చెన్నై, కంచి, బెంగళూరు వంటి ఎక్స్‌ప్రెస్ సర్వీసులు సైతం నిలిపేసి పొరుగు డిపోలకు తరలించారు. ఇక ఉన్న బస్టాండును కేవలం దుకాణాలకు అద్దెలకు ఇస్తూ వచ్చారు. పరిమితికి మించి దుకాణాలు ఏర్పాటు కావడంతో పాటు పొరుగు డిపోలకు చెందిన ఎక్స్‌ప్రెస్ బస్సులు ఈ బస్టాండుకు రాకపోవడంతో గుత్తేదారులు తీసుకున్న దుకాణాలకు జనాల తాకిడే కరువైంది. దీనికి తోడు ఆర్టీసీ అధికారులు ఓసారి మూత పడిన దుకాణాన్ని, కాలపరిమితి దాటిన దుకాణాలను మళ్లీ అద్దెకు ఇవ్వాలంటే గతంలో కంటే అధికంగా నెలసరి అద్దె చెల్లించాలన్న నిబంధనలను వర్తింపజేస్తుండటంతో నేడు పలు దుకాణాలు మూతపడ్డాయి. ఈ డిపో దుస్థితి గురించి ఇక్కడి పలమనేరు పరిరక్షణ సమితి పలుమార్లు ఆందోళనలు చేసినా నిరసనలు తెలిపినా.. అధికారులకు, ప్రజాప్రతినిధులకు వినతి పత్రాలు అందజేసినా ఎవరూ పట్టించుకోలేదు. ఇకనైనా ఆర్టీసీ ఉన్నతాధికారులు స్పందించి పలమనేరు డిపోకు పూర్వవైభవం తీసుకురావడంతో పాటు మూతపడిన దుకాణాల అద్దె తగ్గించి ఆర్టీసీకి ఆదాయం పెంచేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.





పలమనేరు ఆర్టీసీ బస్టాండులో మూతపడిన దుకాణాలు



హోటల్‌లో కూలిపోయిన పైకప్పు

ఇంటర్‌లో కుప్పం విద్యార్థుల జయకేతనం



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్



భరత్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

కుప్పం, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా విడుదలైన ఇంటర్మీడియట్ ఫలితాలలో కుప్పం విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించి జయకేతనం ఎగురవేశారు. ప్రభుత్వ ప్రైవేటు కళాశాలలు రెండూ ఉత్తమ ఫలితాలు సాధించాయి. కుప్పంలోని ప్రభుత్వ వృత్తి విద్యా జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో 62 శాతం, ద్వితీయ సంవత్సరంలో 74 ఫలితాలు సాధించినట్లు ప్రిన్సిపాల్ జ్యోతీశ్వరన్ తెలిపారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపాల్ జ్యోతీశ్వరన్, అధ్యాపకులు అభినందించారు. అలాగే కుప్పంలోని ఎంఎఫ్‌సీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎంపీసీ ద్వితీయ సంవత్సరంలో ఎ.భరత్ అనే విద్యార్థి 1000 మార్కులకు గాను 979 మార్కులు సాధించి జిల్లాలోనే ప్రథమ స్థానంలో నిలిచినట్లు కళాశాల ప్రిన్సిపాల్ వాసుదేవరెడ్డి తెలిపారు. బైపీసీ గ్రూప్‌లో జి.తరుణశ్రీ 945 మార్కులతో ద్వితీయ స్థానంలో నిలిచిందన్నారు. ద్వితీయ సంవత్సరం ఫలితాలలో 50 శాతం, ప్రథమ సంవత్సరం 30 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. పరమసముద్రం కేజీబీవీ పాఠశాలలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో వంద శాతం ఫలితాలు నమోదైనట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

● బీసీఎన్ విద్యా సంస్థలకు చెందిన కుప్పం జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించినట్లు బీసీఎన్ విద్యా సంస్థల వ్యవస్థాపక అధ్యక్షుడు బీసీ. నాగరాజ్, కళాశాల ప్రిన్సిపాల్ శాంతా నాగరాజ్‌లు తెలిపారు. విజయం సాధించిన విద్యార్థులను, అధ్యాపకులను అభినందించారు. అలాగే కుప్పంలోని ఐఆర్‌ఎం జూనియర్ కళాశాలలో విద్యార్థులు సైతం ఉత్తమ ఫలితాలు సాధించినట్లు కళాశాల చైర్మన్ బీఎం.దయానిధి తెలిపారు.



కేడీసీలో విద్యార్థులతో కలిసి చైర్‌పర్సన్ శాంతానాగరాజ్ సంబరాలు



కుప్పం ఐఆర్‌ఎం కళాశాలలో విద్యార్థులను అభినందిస్తున్న చైర్మన్ దయానిధి

విజలాపురం కేజీబీవీ విద్యార్థుల ప్రతిభ

రామకుప్పం, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): ఇంటర్ ఎంపీసీ పరీక్షల్లో రామకుప్పం మండలం విజలాపురం కేజీబీవీ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. 36 మంది విద్యార్థినులు మొదటి సంవత్సరం ఇంటర్ పరీక్షలు రాయగా 25మంది ఉత్తీర్ణులయ్యారు. ఇంటర్ రెండో సంవత్సరం పరీక్షలకు 23 హాజరు కాగా.. 19 మంది ఉత్తీర్ణులయ్యారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థినులను ప్రిన్సిపాల్ అమరావతి, ఉపాధ్యాయులు అభినందించారు. రామకుప్పం అంబేద్కర్ గురుకుల విద్యాలయంలో 57మంది రెండో సంవత్సరం ఇంటర్ పరీక్షలు రాయగా 38 మంది ఉత్తీర్ణులయ్యారని ప్రిన్సిపాల్ రాజేంద్ర తెలిపారు. 74 మంది మెదటి సంవత్సరం పరీక్షలు రాయగా 33 మంది ఉత్తీర్ణులైనట్లు పేర్కొన్నారు. ఏపీ మోడల్ స్కూల్‌లో విద్యార్థులు రెండో సంవత్సరం ఇంటర్‌లో 42 శాతం, మొదటి సంవత్సరం ఇంటర్‌లో 28శాతం ఉత్తీర్ణత సాధించారని ప్రిన్సిపాల్ కృష్ణమూర్తి తెలిపారు.

● కల్లూరు: పులిచెర్ల మండలం ఎల్లంకివారిపల్లి నందవనం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం విడుదలైన ఇంటర్ ఫలితాల్లో బాలికలు ప్రతిభ చూపారని కళాశాల ప్రిన్సిపాల్ తులసీరాం తెలిపారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూపులో 67 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా.. 45 మంది ఉత్తీర్ణులయ్యారని.. 67 శాతం ఫలితాలు సాధించారన్నారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూపుల్లో 87 మంది పరీక్షలు రాయగా 82 మంది ప్రతిభ చూపగా 94 శాతం ఫలితాలు సాధించారని ప్రిన్సిపాల్ తెలిపారు.

●శాంతిపురం: ఇంటర్మీడియట్ ఫలితాల్లో శాంతిపురం మండల విద్యార్థులు సత్తాచాటారు. ఆదర్శ పాఠశాలలో బైపీసీ చదువుతున్న డిల్లీప్రియ 1000 మార్కులకు గాను 977 మార్కులు సాధించి మండల్ టాపర్‌గా నిలిచింది. శాంతిపురం ప్రభుత్వ కళాశాలలో చదువుతున్న ఎంపీహెచ్‌డబ్ల్యూ చదువుతున్న సంజన 961 మార్కులు సాధించి మండల ద్వితీయ స్థానంలో నిలిచింది. అదే కళాశాలలో ఎంపీహెచ్‌డబ్ల్యూ చదువుతున్న నీలికంఠం 960 మార్కులు సాధించి తృతీయ స్థానంలో నిలిచాడు. శాంతిపురం ప్రభుత్వ కళాశాలలో వెన్నెల 950 మార్కులు సాధించింది. ఆదర్శ పాఠశాలలో ఎంపీసీ చదువుతున్న రాగవేంద్ర 952, సీఈసీ చదువుతున్న జ్యోతి 917 మార్కులు సాధించారు. రాళలబూదుగూరు కళాశాలలో రేఖ 856 మార్కులు సాధించి కళాశాల టాపర్‌గా నిలిచింది. ప్రిన్సిపాళ్లు అభినందించారు.

● గుడుపల్లె: గుడుపల్లె ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరంలో 76 మందికి గాను 38 మంది ఉత్తీర్ణులు అయ్యారు. ద్వితీయ సంవత్సరంలో 60 మందికి గాను 45 మంది పాసయ్యారు. మోడల్ స్కూల్ జూనియర్ కళాశాలల్లో మెదటి సంవత్సరంలో 89 మందికి గాను 24 మంది ఉత్తీర్ణ సాధించగా.. ద్వితీయ సంవత్సరంలో 77 మందికి గాను 41 మంది ఉత్తీర్ణత సాధించారు. కస్తూరిబా గాంధీ పాఠశాలలో మొదటి సంవత్సరంలో 33 మందికి గాను 14 మంది పాసయ్యారు. ద్వితీయ సంవత్సరంలో 10 మందికి గాను 8 మంది ఉత్తీర్ణులయ్యారు.

విద్యుత్ అదనపు లోడ్‌కు దరఖాస్తుల ఆహ్వానం

సోమల, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): గృహ వినియోగదారులు అడిషనల్ లోడ్‌కు దరఖాస్తు చేసుకోవాలని ట్రాన్స్‌కో ఏఈ మహేంద్రరెడ్డి కోరారు. ఒక కిలో వాట్ విద్యుత్ కోసం రూ.2400 చెల్లించి అదనపు లోడు పొందేవారని.. ప్రస్తుతం రాయితీపై రూ.1200 చెల్లిస్తేచాలన్నారు. ఈనెలాఖరులోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

19 నుంచి కామిదొడ్డి గంగమ్మ జాతర

బైరెడ్డిపల్లె, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కామిదొడ్డి గంగమ్మ జాతర ఈనెల 19 నుంచి ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. 19న రాత్రి అమ్మవారి శిరస్సు ఊరేగింపు, 20న అమ్మవారి విశ్వరూప దర్శనం, దీపారాధనలు, మొక్కుబడి ఉత్సవం, 21న అమ్మవారి జలధి కార్యక్రమం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పాల్గొని అమ్మవారిని దర్శించుకోవాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

పుంగనూరు రూరల్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు సమీపంలోని పలమనేరు రోడ్డులో శనివారం ఓ ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొనడంతో ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. పట్టణ సమీపంలో టిట్కో ఇళ్లలో కాపురం ఉన్న గణేశ్ కుమారుడు రాజశేఖర్ (23) ద్విచక్ర వాహనంలో పుంగనూరుకు వస్తుండగా అదే మార్గంలోని వేబ్రిడ్జి నుంచి కారు రోడ్డుపైకి రావడంతో ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ప్రమాదంలో రాజశేఖర్ కాలు విరిగింది. స్థానికులు గుర్తించి స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్సలు అందించారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

పుంగనూరు రూరల్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): కుటుంబ సభ్యులు మందలించారని ఓ యువకుడు పురుగులమందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించిన సంఘటన శనివారం పెద్దపంజాణి మండలంలో జరిగింది. పెద్దపంజాణి మండలం కత్తార్లపల్లెకు చెందిన చంద్రప్ప కుమారుడు లక్ష్మీప్రసన్నకుమార్ (28)ను కుటుంబ సభ్యులు మందలించడంతో పురుగులమందు తాగాడు. పొలాల్లో పడి ఉన్నట్లు రైతులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో వెంటనే చేరుకుని లక్ష్మీప్రసన్నకుమార్‌ను చికిత్స నిమిత్తం పుంగనూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అన్నమయ్య జిల్లా మదనపల్లెకు తరలించినట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

మదర్‌థెరిసా విద్యార్థుల సత్తా

గంగవరం, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ ఫలితాల్లో మదర్ థెరీసా కళాశాల విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించారని కళాశాల కరస్పాండెంట్ రవీంద్రబాబు పేర్కొన్నారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో ఎంపీసీ విద్యార్థిని సాయి బృంద 990 మార్కులు, బైపీసీకి చెందిన ధనలక్ష్మి 979 మార్కులు సాధించి సత్తా చాటారన్నారు. ఇంటర్‌ఫస్ట్ ఇయర్‌లో ఎంపీసి విద్యార్థిని హరిత 470 కి 466 మార్కులు, బైపీసీలో సహేదాసారా 440 కి 432 మార్కులు, ఎంఈసీలో రాధ 500 మార్కులకు గాను 487 మార్కులు సాధించి సత్తా చాటారని తెలిపారు.

● వి.కోట: ఇంటర్ ఫలితాలో వి.కోటకు చెందిన వాణి జూనియర్ కళాశాల విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారు. సీనియర్ ఎంపీసీలో ఎస్.దర్శిని 982, బైపీసీలో అంకిత 983, జూనియర్ ఇంటర్ ఎంపీసీలో మోనీషా, లిపికాలు 451, బైపీసీలో మునీరా 435 సాధించినట్లు చైర్మన్ బాలగురునాథ్ తెలిపారు.

కమనీయం.. సీతారాముల కల్యాణం





సీఎస్ అగ్రహారం, తూగుండ్రం, కార్వేటినగరంలో సీతారాముల కల్యాణోత్సవం

పెనుమూరు, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): సీఎస్ అగ్రహారంలో సీతారాముల కల్యాణోత్సవాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. రాత్రి గరుడవాహనంపై స్వామివారిని గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. మనోహర్, రవి, కృష్ణమూర్తి, సుబ్బారెడ్డి, మునికృష్ణారెడ్డి, శంకర్, వెంకటేశ్, అమర్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.

గంగాధరనెల్లూరు: తూగుండ్రంలోని శ్రీచలవెంకటేశ పెరుమాళ్ ఆలయంలోని సీతారాములకు కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. కుమారి వీణచే కర్ణాటక సంగీత కచేరి అలరించింది. ఆలయ ధర్మకర్త కె.రామస్వామి శేఖర్ మొదలి, అర్చకుడు శివస్వామి పాల్గొన్నారు.

గుడిపాల: రామభద్రాపురం రామాలయంలో సీతారాముల కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. గొల్లపల్లెలో రామభక్తులు మాలధారణ చేసి సీతారాములకు ప్రత్యేక అభిషేకాలు చేసి, కల్యాణోత్సవం నిర్వహించారు.

యాదమరి: నాగలాపురం కోదండరామాలయంలో సీతారాముల కల్యాణోత్సవాన్ని గ్రామస్తులు నిర్వహించారు.

వెదురుకుప్పం: కార్వేటినగరంలోని హనుమంతు లక్ష్మణ సమేత కోదండరామాలయంలో కల్యాణోత్సవం నిర్వహించారు.

ఊర్లకెళ్లేవారు పోలీసులకు సమాచారం ఇవ్వండి

చిత్తూరు అర్బన్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ఊర్లకు వెళ్లేవారు పోలీసులకు సమాచారం ఇవ్వాలని రెండో పట్టణ సీఐ నెట్టి కంఠయ్య సూచించారు. కమాండ్ కంట్రోల్ రూమ్ 94409 00005కి సమాచారం ఇస్తే ఆయా ఇళ్లలో దొంగతనాలు జరగకుండా ఎల్‌హెచ్‌ఎంఎస్ కెమెరాల ద్వారా పర్యవేక్షిస్తామన్నారు. నైట్‌బీట్ పోలీసులూ గమనిస్తుంటారన్నారు.

టీచర్లకు సన్మానం

గంగాధరనెల్లూరు, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): పెద్దకాల్వ పంచాయతీ సుందరరాజుపురం వద్ద ఉన్న విజయం స్కూల్లో మండలానికి చెందిన 13 మంది ప్రభుత్వ టీచర్లను అన్నమయ్య జిల్లా రాయచోటికి చెందిన సోమలరాజు ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం సన్మానించారు. జ్యోతిరావు పూలే, అంబేడ్కర్ జయంతిలను పురస్కరించుకుని ఈ కార్యక్రమం నిర్వహించారు. సన్మానం అందుకున్న టీచర్లలో.. గంగాధరం, చెన్నకేశవ రెడ్డి, పురుషోత్తం, కమలాపతి నాయుడు, కోటి, శాంతి, రాజేంద్రన్, విజయకుమార్, కార్తికేయరెడ్డి, ఢిల్లీప్రకాష్, దినకర్, నాగరాజులు నాయుడు, గంగాధరం ఉన్నారు.

ఇంటర్ ఫలితాల్లో ప్రైవేటు కళాశాలల హవా

చిత్తూరు సెంట్రల్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) ఇంటర్మీడియట్ విద్యా మండలి శనివారం విడుదల చేసిన ఫలితాల్లో ప్రైవేటు కళాశాలలు విద్యార్థులు సత్తా చాటారు. అత్యధిక మార్కులు సాధించారు.

● శ్రీ వివేకానంద జూనియర్ కళాశాలలో..



శ్రీవివేకానంద జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించినట్లు యాజమాన్యం మహేంద్రకుమార్, భాస్కర్‌నాయుడు తెలిపారు. ఫస్టియర్ ఎంపీసీలో.. 470 మార్కులకు ఎస్.బైష్ణవ్, సాయి లహరి (466), బీనాశ్రీసాయి, బిందుసాయి, మౌనిక, లోకప్రియ, బాలాజి (465) మార్కులు సాధించారు. బైపీసీలో.. 440 మార్కులకు గౌతమి (431), జాస్మిన్ (417), షరోన్ (416), శైలజ (413) మార్కులు సాధించారు. సీఈసీలో.. 500 మార్కులకు చందు, ఢిల్లీరాణి (465), రోహిణి (443) మార్కులు సాధించారు. సెకండియర్‌లో వెయ్యి మార్కులకు ఎంపీసీలో.. కావ్య (990), భవన (987), చక్రదీప్‌రెడ్డి, స్వాతి (986) మార్కులు సాధించారు. బైపీసీలో.. గాయత్రి (980), నిర్మల్ కుమార్ (973), సీఈసీలో.. జాహ్నవి (960), లోమిత (943) మార్కులు సాధించారు.

● పీఎస్ఎన్ శ్రీవివేకానంద కళాశాలలో..



పీఎస్ఎన్ శ్రీవివేకానంద జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చూపినట్లు కరస్పాండెంట్ పి.సత్యనారాయణ, ప్రిన్సిపాల్ నాగరాజ శెట్టి తెలిపారు. ఫస్టియర్ ఎంపీసీలో.. కె.జుహితరాజ్ (466), రవళిక (465), రోహిణి, లక్ష్మి ప్రసన్న, దీక్షిత్ కుమార్, సాయి తోషిత్, (464), నక్షత్ర, జోషిత (463) మార్కులు సాధించారు. బైపీసీలో.. పౌర్ణమి (404), వరుణ్ (396), సీఈసీలో.. దీపా (426) మార్కులు సాధించారు. సెకండియర్ ఎంపీసీలో.. నిఖిత (990), సాహితి, వాసవి (989), ఐశ్వర్య, లిఖిత (987), మహిత కీర్తి, ప్రశాంతి, పల్లవిశ్రీరామన్ (986) మార్కులు సాధించారు. బైపీసీలో.. రష్మ (960), జోషిత (949), సీఈసీలో పూర్ణిమ (962), వనుక్షక (959), ఇవాంజలీనా (956) మార్కులు సాధించారు. 372 మంది విద్యార్థులు 900 మార్కులకుపైగా మార్కులు సాధించారు.

● విజయం జూనియర్ కళాశాలలో..



విజయం జూనియర్ కళాశాల విద్యార్థులు సత్తా చాటినట్లు అధినేత తేజోమూర్తి తెలిపారు. ఫస్టియర్ ఎంపీసీలో.. పి.వేణి (465), రాజశ్రీ (464), పవన్‌కుమార్ (463), బైపీసీలో.. జ్యోత్స్న (426), ఎంఈసీలో.. గుణశ్రీ (486), సీఈసీలో.. సోమంత్ కుమార్ (476), ఖాసీం అబ్బాస్ (473), 450 కంటే ఎక్కువగా 64 మంది విద్యార్థులు, 400కంటే పైగా 153 మంది విద్యార్థులు మార్కులు సాధించారు. సెకండియర్ ఎంపీసీలో.. గగనసాయి (986), గాయత్రి (983), పవన్‌సాయి (979), బైపీసీలో.. సుమిత్రా (962), శిరీష (952), ఎంఈసీలో.. తన్మయి (974), సీఈసీలో జెస్సిన (966), ఐశ్వర్య (952), 950కి పైగా 67 మంది, 900పైగా 156 మంది విద్యార్థులు మార్కులు సాధించినట్లు తెలిపారు. వీరిని అకడమిక్ ఈడీ శైలజామూర్తి, ప్రిన్సిపాల్ జీవరత్నం నాయుడు, అధ్యాపకులు అభినందించారు.

● నారాయణ జూనియర్ కళాశాలలో..



నారాయణ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చూపినట్లు డీజీఎం కొండలరావు, డీన్ శ్రీనివాసులు, ఏజీఎం శివకుమార్, ప్రిన్సిపాల్ రమేష్ తెలిపారు. ఫస్టియర్ ఎంపీసీలో.. పి.జాహ్నవి (465), జె.జాహ్నవి, కె.సంతోషి, ఇ.జే.హేహచరణ్, పి.గణేష్ (464), కీర్తిక (463), గోపిక (461), బైపీసీలో.. లాస్య (434), పల్లవిసాయి (431), రమ్యశ్రీ (434), ప్రణతి (415), షాలిని (403) మార్కులు సాధించారు. సెకండియర్ ఎంపీసీలో.. దుర్గశ్రీ (989), జశ్వంతి, సాకేత్ (978), యశ్వంత్ (976), సుహాన (974), పూజిత (973), బైపీసీలో.. ఆషాజ్యోతి (984), ఎలిజబెత్ (965) మార్కులు సాధించారు.

● విజ్ఞానసుధ జూనియర్ కళాశాలలో..



విజ్ఞానసుధ జూనియర్ జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చూపినట్లు ఛైర్మన్ శ్రీధర్ తెలిపారు. ఫస్టియర్ ఎంపీసీలో.. బి.భావ్యశ్రీ (463), బైపీసీలో.. ఇవ్వాంజలీన గ్రేస్ (424), సీఈసీలో.. జె.సత్య (468), ఎంఈసీలో.. మోక్షిత (459) మార్కులు సాధించారు. సెకండియర్ ఎంపీసీలో.. జాహ్నవి (984), బైపీసీలో.. యశ్వంత్ (891), సీఈసీలో.. అనుష్క (932), ఎంఈసీలో.. ప్రవిళిక (906) మార్కులు సాధించినట్లు తెలిపారు.

● శ్రీవిద్యావికాస్ జూనియర్ కళాశాలలో..



కొంగారెడ్డిపల్లెలోని శ్రీ విద్యావికాస్ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చూపారని కరస్పాండెంట్ ప్రకాష్ చంద్రారెడ్డి, ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్ మధుమూర్తి, రాజ, ఏవో గోపి తెలిపారు. ఫస్టియర్ బైపీసీలో.. జోస్న (435), నిఖిత (431), సెకండియర్ ఎంపీసీలో.. గజషివాణి (984), సీఈసీలో.. సన్యశ్రీ (973) మార్కులు సాధించారు.

● ఆర్కే జూనియర్ కళాశాలలో..

ఆర్కే జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనపరిచినట్లు కరస్పాండెంట్ బద్రినారాయణ, ప్రిన్సిపాల్ రమేష్‌బాబు తెలిపారు. ఫస్టియర్ ఎంపీసీలో.. పూజశ్రీ (464), శ్యామ్ చరణ్ (459), షాలిని, లోకేష్ (458), బైపీసీలో.. పూరు (434), జశ్విత (423), ఆశ (419), ఎంఈసీలో.. నాగగాయత్రి (488), నితిన్ (486), సీఈసీలో.. లావణ్య (465), సునీల్ (463) మార్కులు సాధించారు. సెకండియర్ ఎంపీసీలో.. గుణశ్రీ (989), ముంతాజ్ మొహాశీన (985), హేమంత్ కుమార్ (977), బైపీసీలో.. సుమలత (979), సిద్ధిక (969), అఫ్రిన్ (965), తనుశ్రీ (923) మార్కులు సాధించారు.

సంక్షిప్తంగా..

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

నగరి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఆటోడ్రైవర్లకు నగరి సీఐ విక్రమ్ సూచించారు. నగరి పట్టణం, మండల పరిధిలోని డ్రైవర్లతో శనివారం పోలీస్‌స్టేషన్‌లో సమావేశం నిర్వహించారు. నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఏకాంబరకుప్పం రైల్వే గేటు వద్ద, సత్రవాడ వద్ద రోడ్డుపై ఆటోలు నిలపొద్దని చెప్పారు.

ఉచిత వైద్యశిబిరం

విజయపురం, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): పాతార్కాడులో శనివారం అడాప్ట్ ఏ విలేజ్ గ్లోబల్ ఫౌండేషన్ యూఎస్ఏ వారి ఆర్థిక సౌజన్యంతో వాసన్ ఐ కేర్ తిరుపతి వారి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. సుమారు 200 మంది పరీక్షలు చేసుకున్నారు. ఏజీఎఫ్ కన్వీనర్ రుద్రరాజు, టీడీపీ మండల అధ్యక్షుడు రమేష్‌రాజు, నేతలు లక్ష్మీపతిరాజు, హరికృష్ణ, రవిరాజు పాల్గొన్నారు.

అంబేడ్కర్ జయంతిని ఘనంగా జరుపుకుందాం: ఎమ్మెల్యే

పూతలపట్టు, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ జయంతిని సోమవారం ఘనంగా జరుపుకుందామని పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ పిలుపునిచ్చారు. శనివారం పూతలపట్టులోని అంబేడ్కర్ సర్కిల్ వద్దకు చేరుకుని ఏర్పాట్లపై పరిశీలించారు. స్థానిక దళిత, టీడీపీ నాయకులతో చర్చించారు. మాజీ కన్వీనర్ ప్రతాపనేని చంద్రమౌళి, దళిత నేతలు దాము, నాగరాజు పాల్గొన్నారు.

వంద మంది ఉద్యోగులకు సన్మానం

చిత్తూరు రూరల్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ జయంతి సందర్భంగా ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో వంద మంది ఉద్యోగులను సన్మానిస్తున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు వినాయకం తెలిపారు. శనివారం చిత్తూరు మండలంలోని ఓ ప్రైవేటు భవనంలో సంఘ నాయకులతో సమావేశం నిర్వహించారు. సోమవారం మధ్యాహ్నం అంబేడ్కర్ భవన్‌లో ఈ కార్యక్రమం జరుగుతుందని చెప్పారు. నాయకులు అరుళ్‌మని, మురళి, షణ్ముగం తదితరులు పాల్గొన్నారు.

జీడీనెల్లూరు వైసీపీ అధ్యక్షుడిగా వెంకటరెడ్డి

గంగాధరనెల్లూరు, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): జీడీనెల్లూరు వైసీపీకి కొత్త అధ్యక్షుడుగా నెల్లేపల్లె పంచాయతీ చిన్నమిట్టపల్లె గ్రామానికి చెందిన కామసాని వెంకటరెడ్డిని నియమించారు.

వైభవంగా పుష్పపల్లకి సేవ

చిత్తూరు కల్చరల్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): కామాక్షి అంబికా సమేత అగస్త్యేశ్వరాలయంలో పంగుణి ఉత్సవాల్లో భాగంగా శనివారం సాయంత్రం పుష్పపల్లకి సేవను భక్తుల ఉభయంతో ఆలయ ఈవో వెంకటరాయలు, అర్చకుడు శివకుమార్ శివాచార్యులు నిర్వహించారు. భక్తులకు పలువురు దాతలు అన్న ప్రసాదాలు పంపిణీ చేశారు.

పల్లకి, అశ్వవాహనాలపై కోదండరాముడి విహారం

చిత్తూరు కల్చరల్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): కోదండరామాలయంలో శనివారం పల్లకి, అశ్వవాహన సేవలు నిర్వహించారు. బాల గురునాథం, విష్ణుభవన్, ఎస్.సి.కె.ట్రేడర్స్‌ల ఉభయంతో ఆలయ ఈవో సుబ్రమణ్యం నాయుడు.. స్వామిని వెన్నకృష్ణుడి అలంకారంలో పల్లకిలో అధిష్ఠింపజేసి, పురవీధుల్లో ఊరేగించారు. సాయంత్రంఉదయ్ జ్యువెలర్స్ విజయం, ట్రిప్లెక్స్ సంస్థల యజయానుల ఉభయంతో అశ్వవాహన సేవ జరిగింది.

అదుపుతప్పి చెట్టును ఢీకొన్న కారు

● ఒకరి మృతి, ఇద్దరికి గాయాలు



దొరస్వామి మృతదేహం



గంగాధరనెల్లూరు, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ఓ కారు అదుపుతప్పి రోడ్డు పక్కనున్న చెట్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, ఇద్దరు గాయపడ్డారు. బంధువులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. కర్ణాటక రాష్ట్రం బెంగళూరుకు చెందిన నాగరాజు పాత వెంకటాపురంలోని తన మామ దొరస్వామి ఇంటికి కారులో శుక్రవారం వచ్చాడు. అదే రోజున తూగుండ్రంలో పని ఉందని చెప్పి మామ దొరస్వామి (65), అదే గ్రామానికి చెందిన భాస్కర్ (47)తో కలిసి కారులో బయల్దేరాడు. తూగుండ్రం పీహెచ్‌సీ సమీపంలో వచ్చేసరికి కుక్కల గుంపు అడ్డు రావడంతో వాటిని తప్పించబోయి పక్కనున్న టేకుచెట్టుకు ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో దొరస్వామి, నాగరాజులకు తీవ్రగాయాలవగా భాస్కర్‌కు స్వల్పగాయమైంది. బాధితులను అంబులెన్స్‌లో చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. దొరస్వామి చికిత్స పొందుతూ శుక్రవారం సాయంత్రం మృతి చెందాడు. నాగరాజు పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. దొరస్వామి కుమారుడు మధు ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఇన్‌చార్జి సీఐ శ్రీనివాసంతి శనివారం తెలిపారు. దొరస్వామి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

అత్తగారింటికి వెళుతుండగా రోడ్డు ప్రమాదం

● యువకుడి మృతి

శ్రీరంగరాజపురం, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. చిత్తూరు కట్టమంచికి చెందిన షణ్ముగం(43) ద్విచక్ర వాహనంపై శుక్రవారం రాత్రి ఎస్ఆర్‌పురం మండలం ఒడ్డుపల్లెలోని అత్తగారింటికి బయల్దేరాడు. మార్గమధ్యంలో చిత్తూరు-పుత్తూరు జాతీయ రహదారిపై 49.కొత్తపల్లెమిట్ట వద్ద ద్విచక్ర వాహనం అదుపుతప్పి కిందపడ్డాడు. తలకు తీవ్రగాయమైంది. స్థానికులు బాధితుడిని 108 ద్వారా చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, మృతుడు భార్య ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సుమన్ తెలిపారు.

విద్యుదాఘాతంతో ఒకరి మృతి

పూతలపట్టు, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. తవణంపల్లె మండలం డి.వడ్డేపల్లెకి చెందిన రఘు (56) ఎలక్ట్రికల్ వర్క్ చేసుకుంటూ కుటుంబాన్ని పోషించేవాడు. పూతలపట్టు మండలం వావిల్‌తోట పంచాయతీ ఈడిగపల్లెకు చెందిన ఓ రైతు పొలంలో శుక్రవారం సాయంత్రం మోటరు రిపేరు చేస్తుండగా విద్యుదాఘాతానికి గురయ్యాడు. స్థానికులు ముత్తిరేవుల వద్ద ఉన్న ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. శనివారం పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆ భూమి మాదే!

విజయపురం, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగమాంబపురం గ్రామ రెవెన్యూ పరిధిలో సర్వే నెంబరు 253/3లో విస్తీర్ణం 1.29 ఎకరాల భూమి నలభై సంవత్సరాలుగా తమ అనుభవంలోనే ఉందని బాలయ్యనాయుడు, జయచంద్రనాయుడు తెలిపారు. తమ తల్లి సుందరమ్మ శుక్రవారం మృతి చెందితే ఆ భూమిలో దహన సంస్కారం చేయడానికి కూడా అడ్డుకున్నారని ఆరోపించారు. 'భూ సమస్యపై కొనసాగిన వివాదం' అంటూ ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన వార్తపై స్పందిస్తూ, తమ తండ్రి గాలి గోవిందస్వామి నాయుడు పేరిట 1బీ, అడంగల్ కూడా ఉందని, ఆభూమిలో రెండు షాపులు, రెండు బోర్లు ఉన్నాయని తెలిపారు. జగదీష్, ఆయన కుటుంబసభ్యులు తమను ఇబ్బంది పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ తల్లి శవాన్ని పూడ్చడానికి తీసిన గుంతను కూడా పూడ్చివేశారని తెలిపారు. న్యాయం చేయాలని కోరారు. ఈ విషయమై తహసీల్దార్ కిరణ్‌ను వివరణ కోరగా.. గోవిందస్వామినాయుడికి రికార్డులు ఉన్న మాట వాస్తవమేనని, ఇరువర్గాల వారికి పాత అన్ రిజిస్టరు అగ్రిమెంటు ఉండడం వలన సమస్య ఉత్పన్నమైనదన్నారు. పూర్తిగా పరిశీలించి 15 రోజుల్లో సమస్య పరిష్కరిస్తామన్నారు.

దాడి ఘటనలో ఐదుగురిపై కేసు నమోదు

చిత్తూరు అర్బన్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ఓ వ్యక్తిపై దాడి చేసిన ఘటనలో ఐదుగురిపై కేసు నమోదైంది. సంతపేట ఎల్లమ్మ వీధిలో సీతారాముల కల్యాణోత్సవం సందర్భంగా పాతకక్షలను దృష్టిలో పెట్టుకుని త్యాగరాజన్‌పై మురళి, మణి, ఆకాష్, మనోజ్, దినకరన్ దాడి చేశారు. త్యాగరాజన్ ముఖంపై బలమైన గాయమైంది. బాధితుడి ఫిర్యాదుతో ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు శనివారం రెండో పట్టణ పోలీసులు తెలిపారు.

ద్విచక్రవాహనం ఢీకొని వృద్ధుడి మృతి

తవణంపల్లె, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనం ఢీకొని ఓ వృద్ధుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. సరకల్లు హరిజనవాడకు చెందిన కాళెయ్య(64) కాణిపాకం వచ్చి శుక్రవారం రాత్రి తిరిగి ఇంటికి బయల్దేరాడు. సీడీఎం కల్యాణ మండపం ఎదుట రోడ్డుపై నడిచి వస్తుండగా గుర్తు తెలియని ద్విచక్రవాహనం ఢీకొంది. గాయపడ్డ వృద్ధుడిని చికిత్స నిమిత్తం చిత్తూరుకు తరలించగా, చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుడు కుమారుడు శ్రీనివాసులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడిగా రవి



కృష్ణయ్యను సన్మానిస్తున్న సంఘ నేతలు

చిత్తూరు అర్బన్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడిగా పూసల రవిని నియమించారు. శనివారం హైదరాబాదులోని విద్యానగర్ బీసీ భవన్‌లో జాతీయ బీసీ సంక్షేమ సంఘం కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సంచార జాతుల సంక్షేమం సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న రవి సేవలను గుర్తించి ఈ పదవి ఇచ్చినట్లు జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య ప్రకటించారు. ఈమేరకు రవికి నియామక పత్రాన్ని అందించారు. అనంతరం దక్షిణాది రాష్ట్రాల ఇన్‌చార్జి షణ్ముగం, నేతలు కలిసి కృష్ణయ్యను సన్మానించారు.

గ్యాస్, పెట్రోలు ధరలు తగ్గించాలి: సీపీఐ

నగరి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): పెంచిన గ్యాస్, పెట్రోలు ధరలను తక్షణం తగ్గించాలంటూ సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. నగరి పట్టణంలో శనివారం ఉదయం 11 గంటలకు అంబేడ్కర్ విగ్రహం వద్ద సీపీఐ పట్టణ కార్యదర్శి వేలన్ అధ్యక్షతన నిరసన తెలిపారు. కార్పొరేట్ సంస్థల కొమ్ము కాస్తూ పేదలపై పెనుభారం మోపుతున్న కేంద్రప్రభుత్వ మొండి వైఖరి నశించాలన్నారు. నగరి నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి కోదండయ్య, వేలన్, బాషా, శేఖర్, రాజేష్, రఫీ, జార్జి పాల్గొన్నారు.

హనుమజ్జయంతి వేడుకలు




పాళ్యంకొండపై, కార్వేటినగరంలో ఆంజనేయ స్వామికి పూజలు

గుడిపాల, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): పాళ్యంకొండలోని ఆంజనేయస్వామి పాదాల వద్ద శనివారం హనుమజ్జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. దాతల సహకారంతో మధ్యాహ్నం భక్తులకు అన్నదానంతోపాటు కోలాటాలు, సాయంత్రం దీపోత్సవాన్ని నిర్వహించారు. ఆలయ కమిటీ ఛైర్మన్ గుర్రప్ప నాయుడు, కార్యదర్శి తారకరామ్, సభ్యులు పాల్గొన్నారు.

వెదురుకుప్పం: కార్వేటినగరంలోని ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం హనుమజ్జయంతి వేడుకలను నిర్వహించారు. స్వామిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులను దర్శనభాగ్యం కల్పించారు.

చిత్తూరు కల్చరల్: గిరింపేట సీబీ రోడ్ వీరాంజనేయ, పొన్నియమ్మ గుడి వీధి వీరాంజనేయ, బోడికొండ మృత్యుంజయ ఆంజనేయస్వామి ఆలయాల్లో హనుమజ్జయంతి వేడుకలు జరుపుకున్నారు.

మొక్కు చెల్లించుకున్న ఎమ్మెల్సీ కంచర్ల



పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న కంచర్ల శ్రీకాంత్ దంపతులు

విజయపురం, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎం.అగరంలోని రామాలయంలో శనివారం నిర్వహించిన సీతారాముల కల్యాణోత్సంలో కంచర్ల శ్రీకాంత్, సరిత దంపతులు పాల్గొని మొక్కు చెల్లించుకున్నారు. ఎన్నికల్లో విజయం సాధిస్తే సీతారాముల వారికి కల్యాణం జరిపిస్తామని కంచర్ల మొక్కుకున్న విషయం తెలిసిందే. నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్, అరుణమిల్క్ ఎండీ మునిశేఖర్ నాయుడు, మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ గోవర్ధన్‌నాయుడు, గ్రామస్తులు రవినాయుడు, దాముునాయుడు, శరవణనాయుడు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సత్యనారాయణ స్వామి వ్రతం



ఐరాల (కాణిపాకం), ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయానికి అనుబంధంగా ఉన్న వరదరాజస్వామి గుడి ప్రాంగణంలో సత్యనారాయణ స్వామి వ్రతాన్ని భక్తులు శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. రాత్రి సత్యనారాయణ స్వామి విగ్రహాన్ని గరుడ వాహనంపై ఉంచి ఊరేగించారు. పౌర్ణమిని పురస్కరించుకుని రాత్రి ప్రధాన ఆలయంలోని మూల విరాట్‌కు విశేష పూజలు నిర్వహించి రాత్రి సిద్ధి,బుద్ధిసమేత వరసిద్ధి వినాయక స్వామి ఉత్సవర్లను కాణిపాకం పురవీధుల్లో ఊరేగించారు. ఈ కార్యక్రమానికి కాణిపాకానికి చెందిన ఆలయ దివంగత ప్రధాన అర్చకుడు చంద్రమౌళిగురుకుల్ కుటుంబీకులు ఉభయదారులుగా వ్యవహరించారు. ఈవో పెంచలకిషోర్, ఏఈవో రవీంద్రబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

వరసిద్ధుడి అన్నదానానికి రూ.1.05 లక్షల విరాళం

ఐరాల(కాణిపాకం), ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): కాణిపాక వరసిద్ధుడి ఆలయ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమానికి విజయనగరానికి చెందిన శివప్రసాద్ రూ.1,05,000 శనివారం విరాళంగా అందించారు. స్వామిని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్, కేంద్ర మాజీ మంత్రి పనబాకలక్ష్మి, కర్ణాటక హైకోర్టున్యాయమూర్తి జస్టిస్ రాజేష్ రాయ్ దర్శించుకున్నారు.



అర్ధగిరిలో వైభవంగా పౌర్ణమి వేడుకలు



అర్ధగిరిలో సుదర్శన హోమం నిర్వహిస్తున్న అర్చకులు

తవణంపల్లె, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రం అర్ధగిరి వీరాంజనేయ స్వామి ఆలయంలో శనివారం పౌర్ణమి వేడుకలు జరిగాయి. ఆలయ ప్రధానార్చకుడు వేణుగోపాలాచ్చార్యులు ఆధ్వర్యంలో ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, సుదర్శన హోమం నిర్వహించారు. సాయంత్రం ప్రాకారోత్సవం జరిగింది. భక్తుల కాలక్షేపం నిమిత్తం సాంస్కృతిక కార్యక్రమాలు, అన్నదానం చేశారు.

విజయపురం: జగన్నాథపురం శ్రీరామనామక్షేత్రంలో సీతారాముల వారికి పౌర్ణమి పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ పురోహితుడు రాంప్రసాద్‌శర్మ, భక్తులు పాల్గొన్నారు.

నింద్ర: కూనమరాజుపాలెంలోని మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో పౌర్ణమి పూజలు జరిగాయి. గీతామందిరం ఆశ్రమం పీఠాధిపతి పుండరీక వరదానంద స్వామి పాల్గొన్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు రూపేష్ కృష్ణ ఆచార్యులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పాలసముద్రం: రాచపాళ్యంలోని బాలగురునాథేశ్వరాలయంలో రుద్ర హోమాన్ని నిర్వహించారు. తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి కూడా భక్తులు పాల్గొన్నారు.

చిత్తూరు కల్చరల్: కట్టమంచి కులందేశ్వర ఆలయంలో శనివారం కల్యాణోత్సవం నిర్వహించారు. భక్తులకు స్వామి వారి తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ● గిరింపేట వల్లీ దేవసేన సమేత చెంగల్రాయ కొండ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో శనివారం పౌర్ణమి పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి గిరి ప్రదక్షిణను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. గిరింపేట సత్యసాయి సంస్థాన్‌లోనూ పౌర్ణమి సందర్భంగా పల్లకి సేవ నిర్వహించారు. ఈవో వెంకట సుబ్బారెడ్డి, నిర్వాహకులు పూలసుబ్రహ్మణ్యం నాయుడు, ఎస్.మధుసూదనం, ప్రభాకర్‌నాయుడు, పాండురంగం పాల్గొన్నారు.